Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు


rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 210 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 29 - 3 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## అమరావతికి చట్టబద్ధత కల్పించాలని ఏకగ్రీవ ఆమోదం






**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానానికి ఏకగ్రీవంగా అమోదించిన ఏపీ శాసనసభ. విభజన చట్టం సెక్షన్-5(2)ను సవరించాలని కోరుతూ ఎట్ అమరావతి అనే పదాన్ని చేర్చాలంటూ అసెంబ్లీ తీర్మానం. సీఆర్డీఏ నోటిపై చేసిన ప్రాంతాలకు కూడా రాజధాని పరిధి వర్తింప చేసేలా చట్ట సవరణ కోరుతూ తీర్మానం. ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపిన రాష్ట్ర శాసనసభ. రాజ్యసభ ఛైర్మన్, లోక్ సభ స్పీకర్ కు అమరావతిని రాజధానిగా చట్టబద్ధత కోరుతూ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని పంపిన అసెంబ్లీ స్పీకర్. కేంద్ర హోం మంత్రికి తీర్మానం కాపీని పంపిన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు. తీర్మానం కాపీలను కేంద్ర హోం కార్యదర్శి, ఏపీ సీఎస్‌కు పంపిన అసెంబ్లీ సెక్రటరీ జనరల్.

## 'ఆర్డీటీ'పై మాట నిలబెట్టున్నాం

### - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత - కూటమి ప్రభుత్వం చొరవతో విదేశీ నిధుల రెన్యూవల్ పునరుద్ధరణ - సేవా కార్యక్రమాలతో పేదలకు ఎంతో మేలు - సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు - వైసీపీకి క్రెడిట్ చోరీ అలవాటే... - మీడియా పాయింట్‌లో మంత్రి సవిత విసుర్లు

**అమరావతి, (రాజధాని వార్తలు):** అనంతపురంలోని రూరల్ డవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) సంస్థకు నిధుల సమీకరణకు విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ)ను పునరుద్ధరిస్తూ మాట నిలబెట్టుకున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆర్డీటీ విదేశీ నిధుల రెన్యూవల్‌కు సహకరించిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. అసెంబ్లీ ఆవరణలో ఉన్న మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, బంగారు శ్రావణితో కలిసి ఆమె మాట్లాడారు. 60 ఏళ్ల నుంచి ఆ సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆపద్బాంధవిలా నిలుస్తూ, సామాజిక సేవలు అందిస్తోందన్నారు. స్పెయిన్ నుంచి వచ్చిన విన్సెంట్ ఫెర్రర్, ఆన్ ఫెర్రర్ దంపతులు అనంతపురంలోని వెనుకబడిన ప్రాంతాలను చూసి చలించిపోయారన్నారు. ఆర్డీటీ సంస్థను స్థాపించి పేదలకు విద్య, వైద్య సేవలు అందించారన్నారు. ఇళ్లు లేని వేలాది మందికి గృహ సదుపాయం కల్పించారని, మరికొందరు పేదలకు వ్యవసాయం కోసం భూములిచ్చారని, ఆధునిక పనిముట్లు అందిస్తూ రైతులకు తోడుగా నిలిచారని కొనియాడారు. ముఖ్యంగా, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందజేశారని, ఎందరో అనంతపురం క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన సందర్భాలున్నాయన్నారు. ఆర్డీటీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుతో ఎందరో పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అత్యవసర చికిత్స కోసం బెంగళూరుకో, హైదరాబాద్‌కో వెళ్లాల్సిన అవసరం తప్పిందన్నారు. ముఖ్యంగా గర్భిణులకు ఈ ఆసుపత్రి ఓ వరమన్నారు. వేలాది మంది పేద బిడ్డలను చదివించి ఆ సంస్థ ప్రయోజకులను చేసిందని మంత్రి కొనియాడారు.

**మాట నిలబెట్టుకున్నాం**

ఆర్డీటీ నిధుల సమీకరణలో సాంకేతిక అంశాల కారణంగా విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ) నిలిచిపోయిందని మంత్రి సవిత తెలిపారు. ఇదే విషయమై తనతో పాటు టీడీపీ ఎమ్మెల్యేలు,




ఎంపీలు.. సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకొచ్చామన్నారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించి, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడారన్నారు. ప్రధాని నరేంద్ర మోడి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను ఒప్పించి, ఆర్డీటీ సంస్థకు నిధుల సమీకరణకు విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ) పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తరచూ మాట్లాడుతూ, ఆర్డీటీ సంస్థకు నిధుల సమీకరణకు విదేశీ నిధుల రెన్యూవల్ కు అనుమతులు వచ్చేలా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహననాయుడు కూడా కృషి చేశారన్నారు. ఎనిమిది నెలల కిందట ఇదే వేదిక మీద ఆర్టీడీ విదేశీ నిధుల రెన్యూవల్‌ను పునరుద్ధరించి తీరుతామని తెలిపామని గుర్తుచేశారు. చెప్పిన మాటకు కట్టుబడుతూ ఆర్టీడీ విదేశీ నిధుల రెన్యూవల్ ను పునరుద్ధరించామన్నారు.

**వైసీపీదే క్రెడిట్ చోరీ**

క్రెడిట్ చోరీకి పాల్పడడం వైసీపీకి అలవాటుగా మారిందని మంత్రి సవిత ఎద్దేవా చేశారు. ఆర్డీటీ సేవలు నిలిపేసినా, జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, తరచూ కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతూ, ఆర్డీటీ సేవలు పునరుద్ధించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తమ వల్లే ఆర్డీటీ విదేశీ నిధుల రెన్యూవల్‌ను పునరుద్ధరించారని వైసీపీ చెప్పుకోవడం సిగ్గుచేటని మంత్రి సవిత విమర్శించారు.

## మీరు రావద్దు, ప్రధాని పదవి పోతుందన్నారు.. నొయిడా సెంటిమెంట్‌పై మోదీ




**నొయిడా:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా నొయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని శనివారం నాడు ప్రారంభించారు. గత పాలకులు మూఢనమ్మకాలతో నొయిడా అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శించారు. నొయిడాలో పర్యటిస్తే అది నాయకుల కెరీర్‌కు అపశకునంగా మారుతుందనే ప్రచారం చాలా కాలంగా ఉందని, అయితే తాను మాత్రం దీనిని పట్టిం చుకోలేదని చెప్పారు. 'మూఢనమ్మకాల కారణంగానే నొయిడాను నాయకులు పట్టించుకోలేదు. గత పాలకులు ఇక్కడకు వస్తే పదవి కోల్పోతామని భయపడుతుండేవారు. అందుకే నొయిడాకు రావడం మానేశారు' అని మోదీ చెప్పారు. తనకు వ్యక్తిగతంగా ఎదురైన అనుభవాన్ని ఈ సందర్భంగా పంచుకున్నారు. 'నాకు గుర్తుంది. సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నొయిడాకు వచ్చేందుకు ప్లాన్ చేసుకున్నాను. దీంతో సీఎం ఆందోళన చెందారు. కార్యక్ర మానికి ఆయన దూరంగా ఉండటమే కాకుండా నన్ను కూడా రావద్దని చెప్పారు. మోదీజీ... నొయిడా వెళ్లకండి.. ఇప్పుడే మీరు ప్రధాన మంత్రి అయ్యారని సూచించారు. అయితే నేను నొయిడా ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తానని, అదే తనకు దీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశం ఇస్తుందని ఆయనతో చెప్పాను' అని మోదీ తెలిపారు. ఒకప్పుడు నాయకులు వదిలేసిన ఈ ప్రాంతమే ఇప్పుడు ప్రపంచ నాయకులను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉందని, స్వయం సమృద్ధి, నిర్భర భారత్‌కు గర్వకారణంగా నిలిచిందని ప్రధాని ప్రశంసించారు.

**నొయిడా శాపం...?**

అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి నొయిడా వెళ్లి వస్తే పదవి కోల్పోతారని మూఢనమ్మకం ఒకటి మూడు దశాబ్దాలుగా కొనసాగుతోంది. 1988లో ముఖ్యమంత్రి వీర బహదూర్ సింగ్ నొయిడా వెళ్లి తిరిగి వచ్చిన కొద్దిరోజులకే తన పదవిని కోల్పోయారు. నొయిడాకు వెళ్లి వచ్చిన తర్వాత పదవి కోల్పోయిన వారిలో 1989లో ఎన్డీ తివారీ, 1995లో ములాయం సింగ్ యాదవ్, 1997లో మాయావతి, 1999లో కల్యాణ్ సింగ్ ఉన్నారు. యూపీ ముఖ్యమంత్రిగా పని చేసిన రాజ్‌నాథ్ సింగ్ సైతం నొయిడా-ఢిల్లీని అనుసంధానించే డీఎన్‌డీ ఫ్లైవేను నొయిడా నుంచి కాకుండా ఢిల్లీ వైపు నుంచి ప్రారం భించారు. 2013లో ఆసియన్ డవలప్‌మెంట్ బ్యాంక్ సమ్మిట్ నొయి డాలో జరిగినప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ మాత్రం సమ్మిట్‌కు గైర్హాజరయ్యారు. అయితే ఈ మూఢనమ్మకాలను యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎట్టకేలకు బ్రేక్ చేశారు. 2017లో అధికారంలో వచ్చినప్పటి నుంచి నొయిడాకు డజనుకు పైగా పర్యటనలు జరిపారు. 2022లో వరుసగా రెండోసారి సీఎంగా గెలిచారు.

## బ్రహ్మకుమారి సంస్థ - ఆధ్యాత్మిక సేవలో విశిష్ట స్థానం : బి.కె.పద్మజ

**అమరావతి, (రాజధాని వార్తలు):** బ్రహ్మకుమారీస్ అనేది ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక సంస్థ. 1936లో దాదా లేఖరాజ్ (ప్రజాపిత బ్రహ్మ) స్థాపించిన ఈ సంస్థ, రాజయోగ ధ్యానం ద్వారా మనశ్శాంతి, ఆత్మజ్ఞానం, నైతిక విలువలను పెంపొందించడాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సంస్థ ప్రత్యేకత ఏమిటంటే, మహిళలకు నాయకత్వ స్థానం కల్పించడం. స్త్రీ శక్తిని ప్రోత్సహిస్తూ సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచంలోని 100కి పైగా దేశాలలో వేలాది కేంద్రాలతో బ్రహ్మకుమారీస్ విస్తరించింది. ఉచితంగా ధ్యాన శిక్షణలు, ఆధ్యాత్మిక తరగతులు, సదస్సులు నిర్వహిస్తూ ప్రతి వర్గానికి చేరువవుతోంది. ఒత్తిడి తగ్గించడం, మనసును ప్రశాంతంగా ఉంచడం, సానుకూల ఆలోచనలను పెంపొందించడం వంటి అంశాల్లో ఈ సంస్థ ప్రత్యేక




మార్గదర్శకత్వాన్ని అందిస్తోంది. "మనసును శాంతంగా ఉంచితే జీవితం సుఖంగా ఉంటుంది" అనే సందేశంతో బ్రహ్మకుమారీస్ లక్షలాది మందికి ప్రేరణగా నిలుస్తోంది అని పద్మ సిస్టర్ తెలిపారు.

## శాతవాహనుల కాలం నుంచి అమరావతి ఓ కీలకమైన రాజధాని ప్రాంతం : తాడికొండ ఎమ్మెల్యే



**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతి రాజధానిపై తీర్మానంలో భాగంగా ల్యాండ్ పూలింగ్-స్వాగతించిన అమరావతి రైతులు అంశంపై శాసన సభలో తాడికొండ ఎమ్మెల్యే మాట్లాడుతూ... 13 ఏళ్ల తర్వాత రాష్ట్ర రాజధానిగా మళ్లీ అమరావతిని పేర్కొంటూ తీర్మానం చేసుకోవాల్సి వస్తోంది. ఈ చారిత్రాత్మక తీర్మానంలో భాగస్వామ్యం వహిస్తున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు, అభినందనలు తెలియచేస్తున్నాను. అమరావతికి చట్టబద్ధత కోసం విభజన చట్టంలో సెక్షన్ 5 (2)ను సవరించుకునేలా కేంద్రం అవకాశం కల్పించింది. శాతవాహనుల కాలం నుంచి అమరావతి ఓ కీలకమైన రాజధాని ప్రాంతంగా విలసిల్లింది. సంస్కృతీ సంప్రదాయాలు, విజ్ఞానం కూడా గొప్పగా పరిఢవిల్లిన ప్రాంతం ఇది. ఆచార్య నాగార్జునుడు, హ్యుయాన్ త్సాంగ్‌లాంటి చైనా యాత్రీకులు ఇక్కడి చరిత్రను ప్రపంచానికి చాటారు. ఇలాంటి ప్రాంతాన్ని రాష్ట్రం విడిపోయాక రాజధానిగా అభివృద్ధి చేసే అవకాశం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వచ్చింది. విభజన కష్టాలు, నష్టాలతో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న రాష్ట్రంలో నూతన రాజధాని నిర్మాణం అంటే మాటలు కాదు. అందుకే భూసేకరణ చట్టం బదులు, భూసమీకరణ అనే వినూత్న ప్రయోగం చేశారు. రైతులు భూములు త్యాగం చేశారు. 34 వేల ఎకరాల భూమిని రాజధాని కోసం రైతులు ఇచ్చారు. తద్వారా రైతులు కూడా లబ్ది పొందేలా చేశారు. 58 రోజుల్లోనే మొత్తం భూసేకరణ పూర్తి చేసి నిర్మాణాలు మొదలు అయ్యాయి. దేశానికే ఓ మోడల్‌గా ఈ సమీకరణ నిలిచింది. ఈ భూసమీకరణ ప్రక్రియ ప్రపంచ రికార్డును సాధించింది కూడా. గత పాలకుడు రాజధానికి 30 వేల ఎకరాలు కావాలన్నారు. కానీ ఆ తర్వాత అనేక అడ్డంకులు కల్పించి ఇబ్బందులు పెట్టారు. రైతుల్లో అభద్రతా భావాన్ని కల్పించారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి పనికి రాదని, ప్రపంచ బ్యాంకు కూడా రుణాలు ఇవ్వొద్దని ఈమెయిళ్లతో అడ్డంకులు సృష్టించారు. స్మశానం, ఎడారి అంటూ హేళన చేశారు. రైతుల్ని వేధించారు. దీనిని ధీటుగా ఎదుర్కొన్న రైతులు దీనిని సమరావతిగా మార్చారు. కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ రాజధాని పునర్నిర్మాణం జరుగుతోంది. శాశ్వత రాజధానిగా ఈ తీర్మానం చేసుకోవటం అభినందనీయం.

# రూ.5 కోట్లతో జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ఆధునీకరణ


## - నెల్లూరు సిటీ తరహాలో రూరల్‌లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి : మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు సిటీ తరహాలో రూరల్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఇందులో భాగంగా రూరల్ పరిధిలోని పొదలకూరు రోడ్డు జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌ను రూ.5 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని వెల్లడించారు. శుక్రవారం పొదలకూరు రోడ్డులోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌ను మంత్రి పరిశీలించి, అక్కడి మౌలిక వసతులు, తరగతి గదుల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు వీఆర్సీ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, స్థానిక నేతలు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే రూరల్ ప్రాంతాల్లో కూడా పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. జడ్పీ బాలికల పాఠశాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులతో ముందుకొచ్చిన ఏఎంఆర్ కన్స్ట్రక్షన్ యాజమాన్యాన్ని అభినందించారు. ఏప్రిల్ 15 తర్వాత పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే పేద విద్యార్థులకు త్వరలోనే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా నారాయణ విద్యా సంస్థల ద్వారా సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అనంతరం ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్ పరిధిలోని గణేష్ ఘాట్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్మిస్తున్న సి.సి రోడ్డు పనుల నాణ్యతను తనిఖీ చేసి పనుల్లో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. పనుల్లో వేగం పెంచి వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీ రావు, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, స్థానిక నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు




**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** పట్టణంలోని అగ్రహారపేట సాయిబాబా ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో పూలతో ప్రత్యేక అలంకారం చేయడం జరిగింది. ఉదయం పాలాభిషేకం అనంతరం బాబా వారిని పూలతో ప్రత్యేక అలంకరణ చేయడం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మంగళ వాయిద్యాలు భజన బృందంతో ఊరేగింపుగా ఉబయదాత తమ్మిరెడ్డి లోకేష్ బాబు నివాసం వరకు పట్టణ పురవీధులలో సాయిబాబా పల్లకి ఊరేగించడం జరిగింది. అనంతరం ఉభయ దాత నివాసం నుంచి అత్యంత వైభవముగా భక్తుల సమూహమునందు నాయుడుపేట పట్టణ పురవీధులలో ఊరేగింపుగా గుర్రముపై గంధము తీసుకు వచ్చి వేదమంత్రాలతో బాబా వారిని అలంకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీరామనవమి నాడు బాబా వారికి ఉభయ దాత సహకారంతో గందాభిషేకం చేస్తాము మధ్యాహ్నం హారతి తదుపరి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తాము భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి అలంకరించిన గంధాన్ని భక్తిశ్రద్ధలతో భక్తులు స్వీకరించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం ఇలాగే ఈ సంవత్సరం ఇంత విజయోత్సవముగా ఎలాంటి ఆటంకం లేకుండా జరగడానికి మూలకారమైన కమిటీ వారి కృషి భక్తుల యొక్క సహకారంతోనో ఇది సాధించామని వారందరికీ శ్రీరాముని ఆశీర్వాదం సాయి బాబా అనుగ్రహం ఎల్లవేళలా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉభయ దాత తమ్మిరెడ్డి లోకేష్ బాబు, ప్రభాకర్ నాయుడు, తిరుమల నాయుడు, శ్రీధర్, మనోహర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రాజబాబు, జయరామానాయుడు, వేంకటేష్ బాబు, బాబు రెడ్డి, ముత్యాల రెడ్డి, నారాయణ, సిద్దయ్య, సిద్ధార్థ, చంద్రశేఖర్, సాయిబాబా గుడి పురోహితుడు శంకర్ మరియు భక్తులు పాల్గొన్నారు.

# కోట ఆర్ అండ్ బి ఆఫీస్ ఆవరణంలో మందు బాబుల హల్చల్

## - నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరిస్తున్న ఆర్ అండ్ బి అధికారులు - ఆర్ అండ్ బి ఉన్నతాధికారులు చొరవ చూపాలని వేడుకుంటున్న స్థానిక ప్రజలు





**కోట, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా కోట మండలంలో రహదారులు మరియు బవనమల శాఖ సబ్ డివిజన్ ఆఫీస్ ఆవరణంలో మందుబాబుల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. పలు విషయంపై అనేక మార్లు పత్రికల్లో వచ్చిన పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్న ఆర్ అండ్ బి అధికారులు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమ నిబంధనలు తుంగలో తొక్కుతున్న కోట మండల ఆర్ అండ్ బి అధికారులు నిత్యం ఇదే దారిన స్కూలు, కాలేజీలకు విద్యార్థులు పోయేటువంటి ప్రధాన రహదారిలో ఈ ఆర్ అండ్ బి ఆఫీసు ఉండడం గమనార్హం. ఆర్ అండ్ బి ఆఫీస్ ఆవరణంలో సరైన భద్రత లేకపోవడం వలన ప్రహరీ గోడ, గేటు వంటివి లేనందున మందుబాబులు నేరుగా ఆఫీసు ఆవరణములో కూర్చుని దర్జాగా మందు కొడుతున్న పరిస్థితులు, బీరు సీసాలు, మందు బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లతో నిండిపోయిన ఆర్ అండ్ బి ఆఫీస్ ఆవరణం. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ చూపి ముందుబాబులు ఆగడాలకు చెక్ పెట్టి ఆర్ అండ్ బి ఆఫీస్ పరిశుభ్రతకు, భద్రతకు భరోసా కల్పించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

# ప్రయాణికుల భద్రతకు ముమ్మర తనిఖీలు



**దొరవారిసత్రం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ఇటీవల కాలంలో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతుండటంతో, ప్రమాదాల నివారణ కొరకు రవాణా శాఖ, అగ్నిమాపక శాఖ, పోలీస్ శాఖ వారు కలిసి సూళ్లూరుపేట టోల్ ప్లాజా దగ్గర ముమ్మర తనిఖీలు నిర్వహించారు. దూరప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ప్రయాణికులు భద్రత కొరకు వారికి ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా బయటపడాలి అని ప్రయాణికులకు అవగాహన కల్పించారు. బస్సులలో అత్యవసర ద్వారాలు సరిగా తెరుచుకుంటున్నాయా లేవా అని, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్ సిలిండర్లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేవా అని, అవి ఉపయోగించే విధానం గురించి బస్సులో సిబ్బందికి తెలుసా లేదని తనిఖీ చేశారు. బస్సులకు ఫిట్నెస్, లైసెన్స్ పత్రాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు మరియు భద్రతా ప్రమాణాలు పాటించని బస్సులకు అపరాధ రుసుములు వేశారు. భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాల యందు కఠినంగా వ్యవహరిస్తామని రవాణా శాఖ ప్రత్యేక అధికారి, స్వప్నిల్ రెడ్డి, అగ్నిమాపక అధికారి హరీష్ తెలిపారు.

# రైస్ మిల్లు కాలుష్యంపై తహశీల్దార్‌కు ఫిర్యాదు





**కోట, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా కోట మండలం వెంకన్న పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని వీరారెడ్డి సత్రం గ్రామంలో ఉన్న ఒక రైస్ మిల్లు, స్థానిక కాలనీవాసుల పాలిట యముడిగా మారింది అని, మిల్లు నుంచి వస్తున్న కాలుష్య వ్యర్థాలు, బియ్యపు పొట్టుతో ప్రజలు ఊపిరి పీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అన్యాయంపై మండిపడుతూ గ్రామస్థులు గురువారం కోట మండల తాసిల్దార్ కటారి జయరావు, మండల అభివృద్ధి అధికారి దిలీప్ కుమార్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. రైస్ మిల్లు నుంచి నిత్యం వెలువడే దుమ్ము, ధూళి మరియు బియ్యపు పొట్టు నేరుగా పక్కనే ఉన్న కాలనీ నివాసాల మీదకు వచ్చి పడుతోంది. దీనివల్ల ఇళ్లలో ఉండలేని పరిస్థితి, తిండి తినలేని దౌర్భాగ్యం నెలకొంది గ్రామస్తులు అంటున్నారు. గాలిలో కలిసిన బియ్యపు పొట్టు కళ్లలో పడటంతో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్రమైన కంటి సమస్యలతో బాధపడుతున్నారు అని "మా కళ్లు పోతే సమాధానం ఎవరు చెబుతారు?" అని బాధితులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. "మేము పేద కుటుం బాలం కాబట్టే మా గోడు మీకు వినబడటం లేదా?" అంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ధనబలం ఉన్న రైస్ మిల్లు నిర్వాహకుల కోసం సామాన్యుల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారా అని వారు మండిపడుతున్నారు. ఈ సమస్యపై గతంలో అనేకసార్లు రైస్ మిల్లు యాజమాన్యానికి విన్నవించినా, వారు ఏమాత్రం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. వారి లాభాల కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడం ఏంటని ఘాటుగా విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో వెంకన్న పాలెం సర్పంచ్ మధు యాదవ్, వైస్ సర్పంచ్ శ్రీనివాసులు, గౌడ్ సంఘ టౌన్ సొసైటీ ప్రెసిడెంట్ మల్లికార్జున్ గౌడ్,బూత్ కన్వీనర్ కుమారి రమణ గౌడ్, కుడుముల నరేష్, మోసూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వెంటనే అధికారులు స్పందించి సదరు రైస్ మిల్లుపై విచారణ జరిపి, కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో కాలనీ ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# ఆధ్యాత్మిక రంగం వైపు ఎం.వి. రావు ఫౌండేషన్ శ్రీకారం

## - శిరిడి సాయి మందిరంలో భగవద్గీత పోటీలు



**కోట, (రాజధాని వార్తలు):** కోట మండలం విద్యానగర్ గ్రామంలోని శిరిడి సాయి మందిర సమీపంలో ఉన్న దత్త మందిరంలో ఆవరణలో చెందోడు గ్రామానికి చెందిన ఎం.వి.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పటన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఎం.వి.రావు ఫౌండేషన్ ఇప్పటివరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు సేవలు అందించడం నిర్వహించేవారు. ఈ క్రమంలో ఆధ్యాత్మిక రంగం వైపు వెళ్లేందుకు శ్రీకారం చుట్టారు. ఉగాది పర్వదినం సందర్భంగా మొదటి విడత శ్లోకాలను పటన కార్యక్రమము నిర్వహించగా, రెండవ విడతగా శ్రీరామనవమి రోజున ఎం వి రావు ఫౌండేషన్ భగవద్గీత శ్లోకాల పటన కార్యక్రమానికి భక్తులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా దత్త సాయి సన్నిధిలో అతిధులు, సాయి భక్తులు శ్లోకాలను పఠనం చేశారు. విద్యార్థినీ విద్యార్థులు మధ్య భగవద్గీత శ్లోకాల పఠనం నిర్వహించారు. స్వర్గీయ విద్యాప్రదాత ముప్పవరపు వెంకటేశ్వరరావు ఆదిలక్ష్మి చిత్రపటాలకు పూలమాల వేసి జ్యోతి ప్రజల వన చేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం విద్యార్థినీ విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. భగవద్గీత శ్లోకాలు పోటీలకు చిన్నారులు, పెద్దలు ముందుకు వచ్చి ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం చిన్నారుల విభాగంలో మొదట, ద్వితీయ, తృతీయ పెద్దల విభాగంలో మొదట, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్న వారికి మెమొంటో, సర్టిఫికేట్, భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఈ పోటీలకు హాజరైన వారికి సాయి భక్తులకు భగవద్గీత శ్లోకాలు పుస్తకాలను ప్రతి ఒక్కరికి అందజేశారు. శ్రీరామ నవమి సందర్భంగా విద్యానగర్ షిరిడి సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా భరద్వాజ మాస్టర్‌కి పూజలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్న సంతర్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో భగవద్గీత పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి, సాయి భక్తులందరికీ భగవద్గీత మొదట ద్వితీయ తృతీయ విభాగాలకు చెందిన మూడు పుస్తకాలను ప్రతి ఒక్కరికి ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ పంపిణీ చేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రతి ఒక్కరికి ఎంవి రావు ఫౌండేషన్ ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, శ్రీ షిరిడి సాయిబాబా మందిరం ట్రస్ట్ సభ్యులు వితపు. సూర్యనారాయణ, మాజీ విశ్రాంత ఉపాధ్యాయుడు రామిశెట్టి, యుటిఎఫ్ కోట మండల చైర్మన్ మనోహర్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి రెడ్డి, బాల భారతి శ్రీ విద్యా వికాస్ పాఠశాల సిబ్బంది, కోట వాకాడు మండలాలు కు చెందిన సాయి భక్తులు, విద్యార్థులు సాయి భక్తులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక విభాగం వైపు ఎం వి రావు ఫౌండేషన్ ప్రయత్నిస్తూ రెండవ కార్యక్రమం అత్యంత దిగ్విజయంగా నిర్వహించడంతో ఫౌండేషన్ చైర్మన్‌కు సాయి భక్తులు విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు అభినందించారు. విజేతలు అయినా ఎం జశ్విన్, కే దత్త భరద్వాజ్, ఎం అరుణశ్రీ లతో పాటు కార్యక్రమానికి పాల్గొన్న వారందరికీ బహుమతిగా భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ముఖ్య అతిథులు అయినా కే.రాంశెట్టి, ఎం శేఖర్ బాబు ఎం మనోహర్, కే అరుణశ్రీ, పి వాణిశ్రీ ఘనంగా సన్మానం జరిగింది.



# నాయుడుపేట బార్ అసోషియేషన్ అధ్యక్షులుగా పసల చెంగయ్య

**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నాయుడుపేట బార్ అసోసియేషన్‌కు శుక్రవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా పసల చెంగయ్య ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా తలారి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శులుగా గోళ్ళ వీరాస్వామి, జాయింట్ సెక్రటరీగా షేక్ రఫీ కోశాధికారిగా బల్లి సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ మెంబెర్సగా వై.మోహన్ కృష్ణ, సుష్మ చైతన్య, షేక్ అమానుల్లా, సుధీర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరిరీగా చంద్రగిరి అమర్నాథ్ లేడీ రిప్ర జెంటేటివ్‌గా ఎం.శ్రావణిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారికి పలువురు న్యాయవాదులు అభినందనలు తెలియజేశారు.

# సుష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



**కోట, (రాజధాని వార్తలు):** కోట మండలం తిన్నెలపూడి గ్రామం లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకురాలు గండవరం సుష్మా రెడ్డి ఆధ్వర్యంలో శుక్ర వారం శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. ముందుగా గూడూరు శాసనసభ్యులు సునీల్ కుమార్‌కి తెలుగుదేశం పార్టీ నాయకులకు మరియు కుటుంబ సభ్యులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేసి ఆ శ్రీరాముని ఆశీస్సు లు ఎల్లప్పుడూ మా ఎమ్మెల్యే పాసింజర్ కుమార్‌పై ఉండాలని కోరారు. ఈ పూజ కార్యక్రమానికి గండవరం సుష్మారెడ్డి మూడు రోజులు జరిగే కావమ్మ భజన కథకు 5000 రూపాయలు విరాళం అందించారు. అన్నదాన కార్యక్రమానికి తీర్థ ప్రసాద ములు నైవేద్యాలకు ఉభయ ధాతగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు కారంపూడి శివ శంకర్ శర్మ ఆంజనేయస్వామి కి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి సుష్మా రెడ్డికి భక్తులకు హారతులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా గం డవరం సుష్మా రెడ్డి మాట్లాడుతూ తిన్నెలపూడి గ్రామపంచాయతీ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. ప్రజలందరిపై శ్రీరాముని ఆశీస్సులు ఎల్లవేళలా ఉం డాలని శ్రీరాముడిని కోరుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న అన్న ప్రసాదమును స్వీకరించారు.

# మిల్లులు, కొనుగోలు కేంద్రాల్లో తనిఖీ

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా సంయుక్త కలెక్టర్ మిల్లులు మరియు కొనుగోలు కేంద్రాల్లో తనిఖీ చేసి మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలు మరియు గోనె సంచులు ఎక్కడా కూడా కొరత లేకుండా చూడాలని రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం ద్వారా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిం చాలని సేకరించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది కోవూరులోని పడుగుపాడు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సేకరణ చేసే సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే వారి నుంచి ఏ విధంగా మీరు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు అనేది అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా రైతుకి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ చేయాలని సూచించడం జరిగింది. సౌత్ రాజుపాలెంలో వెంకట సత్యసాయి రైస్ మిల్ మరియు పూజిత రైస్ మిల్స్ పరిశీలించి వారికి తగు ఆదేశాలు



జారీ చేయడం జరిగింది. గోనెసంచులు ఇవ్వడంలో ఆలస్యం అయితే తగు చర్యలు తీసుకుంటామని అలాగే బ్యాంకు గ్యారం టీలు ఇంకా ఎక్కువగా ఇచ్చి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిం చాలని వారికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

# పేటలో వి కప్ టీ కేఫ్‌ను ప్రారంభించిన సినీ నటుడు సత్య ప్రకాష్



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నాయుడుపేట పట్టణంలోని ఆంధ్ర బ్యాంకు వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన వి కప్ టి కేఫ్‌ను శుక్రవారం సినీ నటుడు సత్య ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్య ప్రకాష్ మాట్లాడుతూ నాయుడుపేటకు జన సేన పార్టీ వీర మహిళ రోహిణి నూతనంగా ఏర్పాటు చేసిన కేఫ్‌ను తాను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే నాయుడు పేటకు తనకున్న అనుబంధాన్ని వివరించారు. ఈ సందర్భంగా వి కప్ టీకేఫ్ నిర్వాహకులు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు రఫీ, సూళ్లూరుపేట నియో జకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, జనసేన పార్టీ నాయకులు అట్ల కృష్ణారావు, ఆకుల కుబేరు మణి, చిరంజీవి, బాలు శెట్టి తదితరులు సినీ నటుడు సత్య ప్రకాష్‌కు శాలవాలు కప్పి ఘనంగా సన్మానించి అభినం దనలు తెలియజేశారు. అనంతరం కుంపటి శీను, శేఖర్, సతీష్రెడ్డి, శ్రీనివాసులు, బాలు శెట్టి, పవన్ కళ్యాణ్, మున్నా, సుమతీరావు, వీర మహిళ హేమలత తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కరప మండలంలో శ్రీరామ నవమి వేడుకలు





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, కరప మండలంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని 23 గ్రామాల్లో రామాలయాలు పండుగ వాతా వరణంతో కళకళలాడాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆలయాలను ఒక రోజు ముందుగానే విద్యుత్ దీపాలతో అలంక రించారు. ఆలయ కమిటీ సభ్యులు సీతారాముల కళ్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసి వేడుకలను కన్నులపండువగా నిర్వహిం చారు. వేద మంత్రోచ్ఛర ణలు, భాజాభజంత్రీలు మధ్య, ముత్యాల తలం బ్రాలతో సీతారాముల కల్యాణం భక్తులను అలరిం చింది. ఉదయం గ్రామాల వారీగా సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమా లను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు రామాలయాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపాలకు తరలివచ్చారు. శ్రీరామనవ సందర్భంగా భక్తులకు బెల్లం, మిరి యాలు కలిపిన పానకం, మజ్జిగ, కూల్ డ్రింక్స్, పలు గ్రామాలలో చిన్నారులకు స్వీట్లు చాక్లెట్లు ఐస్ క్రీమ్ మొదలగు వాటిని పంపిణీ చేశారు. కళ్యాణ మహోత్సవం అనంతరం మండలంలోని పలు రామాలయాలలో అన్న వితరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా కరప మండలం అంతా ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిండిపోయింది.

# వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజు పట్ల ధన్యవాదాలు

## - వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేవళ్ళ భాస్కర్ రావు



**కందుకూరు, (రాజధాని వార్తలు):** మైనింగ్ లీజులను వడ్డెర సొసైటీ లకు కేటాయించడం హర్షించదగ్గ విషయమని, ఈ సందర్భంగా వడ్డెర సంఘీయుల తరుపున ఉమ్మడి కూటమి ప్రభుత్వ పెద్దలు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితరులకు రాష్ట్ర వడ్డెర కార్మికుల తరుపున రాష్ట్ర వడ్డెర కార్పొ రేషన్ సభ్యుడు దేవళ్ళ భాస్కర్‌రావు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కల్యాణ్ ఆశయాలు జనసేన పార్టీ సిద్ధాంతాలు కొనసాగేలా కందుకూరు నియోజకవర్గ జనసేన నాయకులు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేవళ్ళ భాస్కర్ రావు వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు కేటాయిస్తూ ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో కూటమి రథసారధి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువనేత నారా లోకేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు. నిత్యం శ్రామిక, సామాజిక వర్గమైన వడ్డెర జాతి సామాజిక ఆర్థిక స్థితిగతులను గూర్చి జనసేన అధినేత పవన్ కల్యాణ్, చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు తదితరులకు సమగ్ర అవ గాహన కలిగి ఉండటం మూలాన వడ్డెర జాతి సామాజిక ఆర్థిక అభ్యున్నతికి ఈ విధంగా నిర్ణయం తీసుకోవడం హర్షించ దగిన విషయమని ఆయన అన్నారు. గత వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడటం అనేది కేవలం ఉమ్మడి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని మరోసారి ఋజువు అయ్యిం దని ఆయన అన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిధులు లేని వివిధ సామాజిక వర్గాల కార్పొరేషన్లు ఏర్పాటుకు ప్రస్తుత ఏపీ క్యాబినెట్ వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు కేటాయింపు నిర్ణయం చెంపపెట్టు వంటిదని భాస్కర్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సినీ నటుడు సత్య ప్రకాష్‌కు ఘన సన్మానం

**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** ప్రముఖ సినీ నటుడు సత్య ప్రకాష్‌ను నాయుడుపేట మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్టేటి చెంచయ్య ఘనంగా సన్మానించారు. శుక్రవారం నాయుడుపేటకు వచ్చిన సినీ నటుడు సత్య ప్రకాష్ పట్టణ సమీ పంలోని పండ్లూరు వద్ద గల ఆర్ ఆర్ ఆర్ కేఫ్ అండ్ హోటల్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి చిట్టేటి చెంచయ్య సినీ నటుడు సత్య ప్రకాష్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం తేనేటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు




అట్లా కృష్ణారావు, కోటేశ్వరరావు, మోదుబోయిన ప్రభాకర్, తదితరులు సినీ నటుడు సత్య ప్రకాష్‌ను, శాలువాలు కప్పి సన్మానించి, అభినందనలు తెలియజేశారు.

# మైనింగ్ చెక్ పోస్ట్ కార్మికుని మృతికి పరిహారంకై సిఐటియు డిమాండ్

## - మైనింగ్ కార్మికులకు భద్రత, కనీస వేతనాలు అమలు, పనిగంటలు పెంపుపై యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు డిమాండ్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మామిడిపాలెం ఏఎంఆర్ మైనింగ్ చెక్ పోస్ట్‌లో మొబైల్ స్క్వాడులో విధుల్లో ఉండి యాక్సిడెంట్‌కు గురై చనిపోయిన ముప్పిడి రామిరెడ్డికి నష్టపరిహారం చెల్లింపుకై సిఐటియు, కుటుంబ సభ్యులతో జరిగిన చర్చల్లో 10 లక్షలు ఇవ్వడానికి అంగీకారం కుదిరింది. ఈ మేరకు ఈరోజు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఉన్న రామిరెడ్డి మృతదే హాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ వెళ్లి పరిశీలించారు. మృతుని బంధువులతో మాట్లాడి ఏఎంఆర్ మైనింగ్ చెక్ పోస్ట్ యాజమాన్యం వెంటనే బాధితుల కుటుంబా నికి 50 లక్షల రూపాయలు ఇవ్వాలని, గాయపడిన మరో కార్మికుడు జగదీష్‌కు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఈ మైనింగ్ చెక్ పోస్ట్‌లో పనిచేస్తున్న కార్మికులు తీవ్ర అభద్రతాభావంలో ఉన్నారని, వీరితో రోజుకు 12 గంటల వరకు పనిచేయించుకోవడం జరుగుతుందని, పిఎఫ్, ఈఎస్ఐ కూడా సక్రమంగా అమలు చేయడం లేదని అన్నారు. ప్రాణాలకు తెగించి రేయంబవళ్ళు మైనింగ్ ప్రాంతాలను చెక్




చేయడంతో పాటు నిత్యం ప్రమాదాలు గురవుతున్న ఎటువంటి ఇన్సూరెన్స్ సౌకర్యం లేదని అన్నారు. వీరందరికీ కనీస వేతనాలు అమలు కావడం లేదని, పనిగంటలు అదనంగా చేయించుకో వడంతో వీరు తీవ్ర అభద్రతాభావంతో ఉన్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం, లేబర్ అధికారులు ఈ చెక్ పోస్టులను తనిఖీ చేసి కార్మికులకు భద్రత కల్పించాలని, కనీస వేతనాలు, పని గంటలు అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# అపోలో హాస్పిటల్స్‌లో చిన్నారి ప్రాణాలను కాపాడిన వైద్య బృందం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అపోలో హాస్పిటల్స్‌లో 10 సంవత్సరాల బాలుడిని తీవ్ర అనారోగ్య స్థితి నుండి వైద్య బృందం విజయవంతంగా కాపాడింది. పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ లీడ్ కన్సల్టెంట్ డా.చిట్టూరి విశ్వతేజ తెలిపారు. బాలుడు తీవ్రమైన ఇన్ఫెక్షన్, శ్వాస సమస్యలు మరియు మీాణాతో ఆసుపత్రికి చేరాడని, వెంటనే వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స ప్రారం భించారు. పరిస్థితి విషమించడంతో ఏఆర్‌డిఎస్ ఏర్పడగా, ఇసిఎంఓ అనే అత్యాధునిక ప్రాణరక్షక చికిత్సను అందించారు. ఇసిఎంఓపై 12 రోజులు ఉండగా బాలుడు క్రమంగా కోలుకు న్నాడు. తదుపరి చికిత్సతో పూర్తిగా కోలుకుని బాలుడు డిశ్చార్జ్ అయ్యాడు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్ సిఓఓ డా.కృష్ణ ప్రసాద్, డా.విశ్వతేజ మరియు బృందం సభ్యులు డా. సన్యాసి నాయుడు, డా.పద్మ, డా.మాళవిక, డా.కిషన్, డా. మౌనిక, డా.ఫజాలా, డా.వైభవ్‌లను అభినందించారు.

# సంపాదకీయం


## మూడు తరాల ప్రభంజనం!


నందమూరి తారక రామారావు 1982 మార్చి 29న స్థాపించిన రాజకీయ పార్టీ 'తెలుగుదేశం' 9 నెలల స్వల్ప వ్యవధిలోనే అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించింది. పార్టీ ఆవిర్భావానికి దారి తీసిన నేపథ్యం ఎంతో ఆసక్తికరమైనది. 1981 అక్టోబర్ నెలలో ఊటీలో ఒకరోజు ఎన్టీఆర్ నటిస్తున్న 'సర్దార్ పాపారాయుడు' చిత్రం షూటింగ్ జరుగుతోంది. విరామంలో ఆయన కుర్చీలో కళ్లు మూసుకొని కూర్చొని తర్వాత సన్నివేశంలోని డైలాగులు గుర్తు తెచ్చుకుంటున్నారు. అక్కడకు వచ్చిన కొందరు పాత్రికేయులు ఆయన చుట్టూ చేరారు. హఠాత్తుగా ఓ పాత్రికేయుడు 'సార్! మరో ఆరు నెలల్లో మీకు 60 సంవత్సరాలు పూర్తవుతున్నాయి షష్టిపూర్తి చేసుకోబోతున్నారు కదా! ఆ శుభ సందర్భంలో ఏదైనా నిర్ణయం తీసుకోబోతున్నారా?' అని ప్రశ్నించాడు. ఎన్టీఆర్ ఒక క్షణం ఆలోచించి "ఎక్కడో నిమ్మకూరులో పుట్టి పెరిగిన నన్ను తెలుగు ప్రజలు సినిమా నటుడిగా, తమ 'అన్న'గా గత 30 సంవత్సరాలుగా నాపై అంతులేని అభిమానాన్ని, ప్రేమను చూపుతున్నారు. నా చిత్రాల్ని అభిమానంతో ఆదరిస్తూ నాకెంతో పేరు ప్రఖ్యాతులనిచ్చారు. ఇప్పుడా రుణాన్నంతటినీ ఏదో ఒక రూపంలో తీర్చవలసిన బాధ్యత నాపై ఉంది. వచ్చే నా పుట్టినరోజు నాటి నుంచి సంఘసేవకు అంకితమవుతాను" అని చెప్పారు. ఎన్టీఆర్ ఎప్పుడూ ఏ విషయాన్నీ తేలిగ్గా చెప్పరు. చెప్పారంటే అది చేసి తీరుతారు. ఆ నిజం తెలిసిన పత్రికలు ఆయన ప్రకటనను ప్రముఖంగా ప్రచురించాయి. ఆ వార్త రాష్ట్రమంతటా కార్చిచ్చులా వ్యాపించింది. ఎన్టీఆర్ ప్రాంతీయ పార్టీ స్థాపించనున్నారన్న వార్త వెలువడే నాటికి ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీలో ఎగిసిన గ్రూపు తగాదాలు భయంకరంగా తయారయ్యాయి. ముఖ్యమంత్రి చెన్నారెడ్డి జాతీయ కాంగ్రెస్ పార్టీకి నిధులు సమకూర్చే నెపంతో విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సొంత పార్టీ నేతలే ఆయనపై విమర్శలు చేశారు. ఆ సమయంలోనే హైదరాబాద్ పాతనగరంలో ఓ మహిళపై పోలీస్ స్టేషన్‌లో జరిగిన అత్యాచార ఘటన దరిమిలా శాంతిభద్రతలు అదుపు తప్పి మత ఘర్షణలు రేగాయి. అసమ్మతి కారణంగా మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి గద్దె నుంచి దిగాల్సి వచ్చింది. ఆ పదవికి టంగుటూరి అంజయ్యను కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపిక చేసింది. 61 మందితో అంజయ్య భారీ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి ఎమ్మెల్యేకు కార్పొరేషన్ పదవో, మరో పదవో ఇచ్చి తనకు అసమ్మతి లేకుండా చేసుకోవడానికి అంజయ్య తంటాలు పడ్డారు. ఇందిరాగాంధీ అండదండలున్నా అసమ్మతి కారణంగా అంజయ్య కూడా ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అంజయ్య స్థానంలో ఎమ్మెల్సీగా ఉన్న భవనం వెంకట్రామ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన పాలనలో అవినీతి కొత్త పోకడలు పోయింది. అసెంబ్లీ కాలపరిమితి మరో రెండు, మూడు నెలల్లో ముగుస్తుందనగా భవనంను తప్పించి కోట్ల విజయభాస్కర్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేశారు. ఆ విధంగా ఐదేళ్ల వ్యవధిలో నలుగురు ముఖ్యమంత్రులు మారారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండా, సీల్డు కవర్లో తాము నిర్ణయం చేసినవారే ముఖ్యమంత్రులయ్యే ఓ దుష్ట సంప్రదాయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం నెలకొల్పింది. ఆ పాలన ప్రజల్లో తీవ్రమైన ఏవగింపు కలిగించింది. నిజానికి రాష్ట్రంలోని ఆర్థిక, రాజకీయ, పరిపాలనా రంగాల్లో వైఫల్యం, నెలకొన్న సంక్షోభాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా స్తంభించిపోయాయి. అటువంటి నేపథ్యంలోనే ఎన్టీఆర్ ప్రాంతీయ పార్టీ ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు. రాజకీయాల్లోకి రావాలని గట్టి నిర్ణయం తీసుకున్న ఎన్టీఆర్.. ముందుగా తాను ఒప్పుకున్న చిత్రాల షూటింగ్ పూర్తి చేసుకొన్నారు. మార్చి 29న మధ్యాహ్నం 2.30 గంటలకు నూతన పార్టీని ప్రారంభించడానికి ముహూర్తం నిర్ణయించారు. హైదరాబాద్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో చిన్న హాలులో కొద్దిమంది సమక్షంలో పార్టీ ఆవిర్భావాన్ని ప్రకటించాలనుకున్నారు. కానీ, ఆ ఉదయం నుంచే రాష్ట్రం నలుమూలల నుంచి ఎన్టీఆర్ అభిమానులు అక్కడికి చేరుకున్నారు. వారంతా దిక్కులు పిక్కటిల్లేటట్లు 'ఎన్టీఆర్ జిందాబాద్' అంటూ నినాదాలు చేస్తున్నారు. దాంతో, పార్టీ ప్రకటన వేదికను న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ ఆవరణలోని పచ్చిక మైదానంలోకి మార్చారు. అభిమానులను ఉద్దేశించి ఎన్టీఆర్ "నా ప్రియమైన సోదర సోదరీమణులారా! కొన్ని నెలలుగా నేను రాజకీయాలలో ప్రవేశించడంపై తీవ్రంగా ఆలోచిస్తున్నాను. ప్రజల స్పందన ఏ విధంగా ఉంటుందోనని అనుకున్నాను. కానీ ఎటువంటి ఆహ్వానం లేకుండానే మీరందరూ ఇక్కడకు రావడం నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది. మీ అభిమానానికి పులకించిపోతున్నాను. ఈ క్షణాన నేను రాజకీయాలలో అడుగుపెడుతున్నాను" అంటూ క్లుప్తంగా ఆయన తన ఉపన్యాసాన్ని ముగించగానే ఆ ప్రాంతమంతా చప్పట్లు, ఈలలు, నినాదాలతో మారుమోగిపోయింది. 'మీ పార్టీ పేరేంటి సార్?' ఎవరో విలేఖరి గుంపులోంచి ప్రశ్నించాడు. ఒక్క క్షణం అంతటా నిశ్శబ్దం. ఎన్టీఆర్ తన లాల్చీ జేబులోంచి ఓ కాగితం బయటకు తీశారు. దానిపై కొన్ని అక్షరాలు రాసి ఉన్నాయి. 'తెలుగుదేశం' అని ఎన్టీఆర్ అంటూ "నేను తెలుగువాణ్ణి. ఈ రోజు నుంచి నా జీవితాన్ని తెలుగు ప్రజల కోసం, ఈ రాష్ట్రం కోసం అంకితం చేస్తున్నాను. మహోన్నతమైన తెలుగు సంస్కృతిని, తెలుగుభాష ఔన్నత్యాన్ని, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతాను. అందుకే మా పార్టీ పేరును 'తెలుగుదేశం'గా నామకరణం చేస్తున్నాను" అని ప్రకటించారు. ఆ విధంగా 44 సంవత్సరాల క్రితం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది.

# ధర్మానికి ప్రతి రూపము శ్రీరాముడు

### - సింహాచలంలో శ్రీరామ నవమి మహోత్సవాలు

### - అన్న సమారాధనకి రూ. 20 వేలు అందించిన గంట్ల





**విశాఖ: సింహాచలం, (రాజధాని వార్తలు):** సింహాచలం అప్పన్న పాదాల చెంత వెలసి ఉన్న అడవి వరం గ్రామంలో శ్రీ రామ నవమి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిపించారు. కొండ దిగువన కోమటి వీధిలో కొలువున్న శ్రీ సీతారాముల ఆలయంలో శ్రీ సీతారాముల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిపించారు. శ్రీరామచంద్రుడు సీతాదేవి లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్లను అందంగా అలంకరించి ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వేదికపై ఆసీనులను చేశారు అనంతరం ఆలయ జగదీష్ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు జాతీయ జర్నలిస్టల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు దంపతులు అలాగే స్థానిక బవిరిశెట్టి వీర్రాజు కుటుంబ సభ్యులు గ్రామస్తులు సీతారాములు కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. సహచర భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారాములను వీరు దర్శించుకున్నారు. 95 వార్డ్ గొల్లవిల్లివానిపాలెంలో శ్రీ సీతారాములను గంట్ల శ్రీనుబాబు దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయ కమిటీలు గంట్ల శ్రీనుబాబు దంపతులను సాదరముగా స్వాగతించి సత్కరించారు.

**అన్నదానమునకు రూ. 20 వేలు విరాళం**


కోమటి వీధిలో అన్నసమారాధనకు రూ. 15 వేలు, మరో ప్రాంతంలో రూ. 5 వేలు విరాళాలు గంట్ల శ్రీనుబాబు దంపతులు అందించారు.

**ధర్మానికి ప్రతి రూపము శ్రీరాముడు**

ధర్మమే గొప్పదని, ఏ గొప్ప గుణం గురించి చెప్పాలన్నా శ్రీరాముడినే ప్రతిరూపంగా చూపిస్తుంది మన భారతీయ సమాజం అని ఇచ్చిన మాటకు కట్టుబడి జనరంజక పాలన సాగించిన గొప్ప ప్రజాపాలకుడు శ్రీరాముడు అని గంట్ల శ్రీనుబాబు కొనియాడారు. హక్కులకంటే బాధ్యత గొప్పదన్నది రామతత్వం, కష్టంలో కలిసి నడవాలన్నది సీతతత్వం అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ధర్మ సంస్థాపన, లోక కల్యాణం కోసం ఎన్నో కష్టాలకోర్చిన శ్రీ సీతారాములు ఎప్పటికి మనందరికీ ఆదర్శం అని అందరికీ ఆదర్శప్రాయుడు శ్రీరామచంద్రుడు అని తెలియజేసారు. ఆదర్శ మూర్తుల చల్లని దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఈ పర్వదినాన్ని, రాములవారి కళ్యాణాన్ని దేశవ్యాప్తంగా వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ధర్మం, సత్యం, ప్రేమ, సంతోషాలతో కూడిన జీవన విధానానికి శ్రీరాముడు ఆదర్శమని సీతారాముల దీవెనలతో అన్నీ శుభాలు కలగాలని భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలని గంట్ల శ్రీను బాబు ఆకాంక్షించారు.

# సన్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం

## పాల్గొన్న విఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



**విశాఖ: బీచ్ రోడ్డు, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం నగరంలోని పాండురంగ స్వామి వీధిలో సన్ గ్రీన్ సంస్థ డాక్టర్ కె.శృతి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ వేడుకలో విశాఖపట్నం మెట్రో పాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ విశిష్ట అతిథిగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక స్వాముల వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కళ్యాణ వేడుక అత్యంత వైభవంగా సాగింది. సన్ గ్రీన్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ కె.శృతి విఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ని సాదరంగా ఆహ్వానించి, పూజా కార్యక్రమాల్లో భాగస్వాములను చేశారు. అనంతరం నిర్వాహకులు చైర్మన్‌ని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ గోపాల్, శృతిలు మాట్లాడుతూ సమాజ హితం కోసం, లోక కళ్యాణం కోసం నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషమైనవని కొనియాడారు. నగర ప్రజలందరికీ ఆయన శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆ రామయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సన్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మళ్లీ రామరాజ్యం రావాలి

### - 33వార్డు శ్రీరామనవమి వేడుకల్లో పల్లకినెత్తుకున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో దుష్ట పరిపాలనకు విముక్తి జరిగి ప్రజలు కోరుకునే విధంగా మళ్లీ రామరాజ్యం రావాలని వైయస్సార్సీపీ సమన్వయకర్త దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. 33వ వార్డు అల్లిపురం కుమ్మర వీధిలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారి పల్లకి ఊరేగింపులో భక్తులతో పాటు పల్లకిని ఊరేగించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ఇచ్చిన మాట తప్పని శ్రీరామచంద్రస్వామి రాజ్యంలో ప్రజలను సుఖశాంతులతో జీవించే వారన్నారు. అలాగే వైసిపి ప్రభుత్వంలలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి మడమ తిప్పని ముఖ్యమంత్రిగా ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచి ప్రజలకు సంక్షేమాన్ని అభివృద్ధిని సుపరిపాలనను అందించారని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వంలో దుష్టసంరక్షణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. 33వ వార్డులో ఘనంగా జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణం వేడుకల్లో తాను కూడా భాగస్వామి అవ్వడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచ దేశాలలో కూడా శ్రీరామ నామ సంకీర్తనతో మార్మోగుతున్నాయన్నారు. తమ అధినేత జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి శ్రీరాముని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులకు దక్షిణ నియోజకవర్గ ప్రజలకు వాసుపల్లి గణేష్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు ప్రెసిడెంట్ ముత్తాబత్తుల రమేష్, మాజీ కార్పొరేటర్ పచ్చిరపల్లి రాము, జిల్లా జనరల్ సెక్రటరీ గణగాళ్ల రామరాజు, వార్డు నాయకులు మహిళ నేతలు స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పలువురు సహాయం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితురాలు మార్ని చిలకమ్మ కుటుంబానికి సామర్లకోట పట్టణ జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్, 27 వార్డు ఇంచార్జ్ అత్తిలి కృష్ణ 25 కిలోల బియ్యం, ఒక నెలకు సరిపడే నిత్యావసర వస్తువులు అందజేశారు. అలాగే ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వైసిపి నాయకులు బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, కొంత నగదు సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెదేపా నాయకులు చల్లా బుజ్జి, గ్రామ వైసీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# హుషారుగా ఇండస్ట్రీ స్పోర్ట్స్ మీట్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఇంటర్ ఇండస్ట్రీ స్పోర్ట్స్ మీట్లో భాగంగా పెద్దాపురం పతంజలి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన వాలీబాల్ పోటీలు హుషారుగా జరిగింది. దీనిలో పలు పరిశ్రమలకు చెందిన క్రీడాకారులైన ఉద్యో గులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదటి బహు మతిని ఆర్ ఏ కె సిరామిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు సాధించారు. శుక్రవారం జరిగిన పోటీల్లో ద్వితీయ బహుమతిని పతంజలి ఫుడ్స్ క్రీడాకారులు సాధించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఏ కె సిరామిక్స్ డీజీఎం టైల్స్ వినోద్, సేఫ్టీ మేనేజర్ బాలాజీ, హెచ్ ఆర్ హెడ్ హరికృష్ణమ రాజు, హెచ్ ఆర్ మేనేజర్ చంద్రశేఖర్, పతంజలి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంట్ హెడ్, బిజినెస్ హెడ్, హెచ్ ఆర్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన శోభాయాత్ర

### - హిందువులంతా ఐక్యంగా ఉండాలి



**అల్లవరం, (రాజధాని వార్తలు):** జై శ్రీరామ్ నామస్మరణతో అల్లవరం మండలం మారు మ్రోగింది. శ్రీరామనవమి సందర్భంగా అల్లవరం మండలం బిజెపి అధ్యక్షులు కట్టా నారాయణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం మొగళ్ళమూరు నుండి పేరూరు వై జంక్షన్ వరకు శోభాయాత్ర బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. మండలం నలుమూలల నుండి వందలాదిగా తరలి వచ్చిన యువకులు బైకులకు జైశ్రీరామ్ నినాదాలతో కూడిన పతాకాలతో ఉత్సాహంగా శోభాయాత్ర భారీ ర్యాలీ నిర్వహించారు. జైశ్రీరామ్ అంటూ నినదించారు. విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి నాగరాజు మాట్లాడుతూ హిందువులంతా ఐక్యంగా ఉండాలని సనాతన ధర్మాన్ని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు యాళ్ళ దొరబాబు, మండల బిజెపి అధ్యక్షులు కట్టా నారాయణమూర్తి ఫాలోవర్స్ పాల్గొన్నారు.

# వైభవోపేతంగా సీతారాముల కళ్యాణం...!



**సామర్లకోట/పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజకవర్గంలో శ్రీరామ నవమి సందర్భంగా సీత రాములోరి కళ్యాణ వేడుకలు శుక్రవారం వైభవపేతంగా జరిగాయి. ప్రజలు భక్తి శ్రద్ధలతో శ్రీరామనవమి పూజలు నిర్వహించారు. ముఖ్యంగా శ్రీరామనవమి వేడుకలను పురస్కరిం చుకుని రామాలయాల్లో వేద మంత్రోచ్చరణల మధ్య కన్నుల పండువగా రాముల వారి కల్యాణం జరిపారు. ఒకరోజు ముందుగానే ఆలయాలను విద్యుత్‌కాంతులతో ముస్తాబు చేసిన ఆలయ కమిటీ సభ్యులు సీతారాముల కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భాజాభజంత్రీలు, వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణాన్ని ఎంతో కమనీయంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు రామాలయాలకు, కళ్యాణ మహోత్సవాల కోసం సిద్ధం చేసిన ప్రత్యేక మండలపాల వద్ద చేరుకుని కళ్యాణ మహోత్సవాలను తిలకించారు. ఉదయం వాడవాడలా సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామోత్సవాలు నిర్వహించారు.

**దాసాంజనేయ ఆలయంలో 5రోజుల వేడుకలు :**

పెద్దాపురం పట్టణంలో 99 సంవత్సరాల అనుభవం కలిగిన అతి పురాతన దేవాలయమైన దాసాంజనేయ ఆలయంలో శ్రీరామ నవమి కళ్యాణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఐదు రోజుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు కమిటీ నాయకులు తెలిపారు. కాగా శ్రీరామనవమి సందర్భంగా పలు ఆలయాల వద్ద వేలాది సంఖ్యలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శ్రీరామనవమి పూజల్లో కూటమ నాయకులు అడబాల్ కుమార్ స్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, రాజా సూరిబాబు రాజు, నూనె రామారావు, పోలవరశెట్టి సత్తిబాబు, సరోజ వాసు, మంచం సాయిబాబు, మాజీ కౌన్సిలర్‌లు, వైసీపీ నాయకులు నేతల హరిబాబు, సేపేని సురేష్, పాక సురేష్ కుమార్, ఆయా ఆలయాల కమిటీలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఆ హీరోతో సిస్టర్ రోల్‌పై సమస్య లేదు.. మదర్‌గా మాత్రం చేయను : రాశి




ఒకప్పుడు టాలీవుడ్‌ను తన అందం, అభినయంతో ఏలిన సీనియర్ నటి రాశి, రెబల్ స్టార్ ప్రభాస్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో చర్చనీయాంశంగా మారాయి. ప్రభాస్ పక్కన నటించాలనే కోరిక ఉన్నప్పటికీ, ఆయనకు తల్లిగా మాత్రం నటించనని ఆమె తెగేసి చెప్పారు. ఈ విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై ఆమె స్పందిస్తూ, అక్క లేదా చెల్లి పాత్రలు చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ 'అమ్మ' అని పిలిపించుకునే పాత్రలకు మాత్రం తాను సిద్ధంగా లేనని క్లారిటీ ఇచ్చారు. ఆ వివరాలు చూద్దాం .. నటి రాశి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ప్రభాస్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ప్రభాస్ మొదటి సినిమా 'ఈశ్వర్' ట్రైలర్ చూసినప్పుడే ఆయన పెద్ద స్టార్ అవుతారని తన సోదరుడితో చెప్పానన్నారు. అయితే, ప్రభాస్ సరసన నటించే అవకాశం వస్తే తల్లి పాత్రను మాత్రం ఒప్పుకోనని ఆమె స్పష్టం చేశారు. ఇక దానికి కారణం వారిద్దరి వయస్సు దాదాపు దగ్గరగా ఉండటమేనని ఆమె అభిప్రాయపడ్డారు. "ప్రభాస్ నన్ను అమ్మా అని పిలవడం నేను తట్టుకోలేను, అందుకే అలాంటి పాత్రలు వస్తే సున్నితంగా తిరస్కరిస్తాను" అని రాశి చెప్పుకొచ్చారు. రాశి చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో కొంతమంది నెటిజన్లు విమర్శలు చేయడంతో, ఆమె తాజాగా 'అనుమాన పక్షి' సినిమా ఈవెంట్‌లో దీనిపై వివరణ ఇచ్చారు. తాను ప్రభాస్‌కు తల్లిగా చేయనని మాత్రమే అన్నానని, సిస్టర్ పాత్రలు చేయనని ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రభాస్ సినిమాలో ఏదైనా కీలకమైన పాత్ర ఉంటే తప్పకుండా చేస్తానని, కానీ తన వయసుకు సెట్ కాని మదర్ క్యారెక్టర్లు మాత్రం చేయనని ఆమె తన నిర్ణయాన్ని మరోసారి నొక్కి చెప్పారు. ఇక ఇది తన వ్యక్తిగత ఇష్టమని, దానిని తప్పుగా అర్థం చేసుకోవద్దని కోరారు. విశేషం ఏమిటంటే, రాశి ఇప్పటివరకు ప్రభాస్‌ను ప్రత్యక్షంగా కలవలేదు. ప్రభాస్ నటించిన 'మిర్చి', 'రాధే శ్యామ్' వంటి సినిమాల్లోని ముఖ్య పాత్రలకు ఆమె డబ్బింగ్ చెప్పారు. ఆయన సినిమాలను థియేటర్లో చూడటానికి మాత్రమే తాను వెళ్తానని రాశి తెలిపారు. ప్రభాస్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవాలనే కల తనలో ఇంకా అలాగే ఉందని, సరైన పాత్ర వస్తే తప్పకుండా నటిస్తానని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక డబ్బింగ్ చెప్పినప్పటికీ ఆయన్ను కలిసే అవకాశం రాకపోవడం కొంచెం వెలితిగా ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం రాశి 'అనుమాన పక్షి' అనే సినిమాలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. రాగ్ మయూర్ హీరోగా, 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. హీరోయిన్‌గా 148 సినిమాలు చేసిన అనుభవంతో చెబుతున్నానని, ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఇక ఈ చిత్రంలోని 'గులాబ్‌జామ్' సాంగ్‌ను ఇటీవల విడుదల చేయగా, దీనికి మంచి రెస్పాన్స్ వస్తోంది. తన సెకండ్ ఇన్నింగ్స్‌లో వైవిధ్యమైన పాత్రలు చేస్తూ ప్రేక్షకులను మెప్పించాలని రాశి భావిస్తున్నారు. నటి రాశి తన కెరీర్ విషయంలో చాలా స్పష్టమైన నిర్ణయాలతో ఉన్నారు. ఇక ప్రభాస్ వంటి స్టార్ హీరో సినిమాలో ఆమెకు సరిపోయే మంచి పాత్ర దొరకాలని, త్వరలోనే వారిద్దరూ కలిసి వెండితెరపై కనిపించాలని కోరుకుందాం.

# పవన్ కళ్యాణ్‌కు వరుణ్ తేజ్ స్పెషల్ థాంక్స్.. ఎందుకో తెలుసా?




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటిస్తున్న కొత్త సినిమా 'బరి' గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఈ సినిమా ఓపెనింగ్ వేడుకకు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. తన బిజీ రాజకీయ షెడ్యూల్‌లోనూ సమయం కేటాయించి వచ్చిన బాబాయ్‌కు వరుణ్ తేజ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టిన విజువల్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతూ మెగా అభిమానుల్లో జోష్ నింపుతున్నాయి. ఆ విశేషాలు చూద్దాం .. మెగా ఫ్యామిలీలో మరో క్రేజీ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. వరుణ్ తేజ్ హీరోగా, 'కమిటీ కుర్రోళ్లు' ఫేమ్ యదు వంశీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'బరి' సినిమా పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు పవన్ కళ్యాణ్ విచ్చేసి తొలి సీన్‌కు క్లాప్ కొట్టడం విశేషం. నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో, మెగా కుటుంబ సభ్యులందరూ హాజరై సందడి చేశారు. పవన్ కళ్యాణ్ రాకతో ఈ సినిమా ప్రారంభోత్సవం పండగలా మారింది. సినిమా లాంచ్ తర్వాత మీడియాలో చిట్ చాట్ చేసిన వరుణ్ తేజ్ చాలా ఎమోషనల్ అయ్యారు. పవన్ కళ్యాణ్ బాబాయ్ ప్రస్తుతం రాజకీయాల్లో చాలా బిజీగా ఉన్నారని, అయినప్పటికీ తన పిలుపు మేరకు వచ్చి అందరినీ బ్లెస్ చేసినందుకు చాలా థాంక్స్ అని వరుణ్ తెలిపారు. "బాబాయ్ తన బిజీ షెడ్యూల్‌లో కూడా మా కోసం టైమ్ స్పెండ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇక ఆయన రాక మా టీమ్ అందరిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది" అని వరుణ్ తేజ్ తన మనసులోని మాటను పంచుకున్నారు. పవన్ కళ్యాణ్ 'బరి' సినిమా ఓపెనింగ్‌కు వచ్చిన ఫోటోలు, వీడియోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. పవన్ కళ్యాణ్ పక్కన వరుణ్ తేజ్, నిహారిక ఉన్న విజువల్స్ చూసి మెగా అభిమానులు ఫిదా అవుతున్నారు. ఇక డిప్యూటీ సీఎం హోదాలో ఉంటూనే తన కుటుంబ సభ్యుల సినిమాలకు అండగా నిలుస్తున్న పవన్ తీరుపై ప్రశంసలు కురుస్తున్నాయి. ఈ క్రేజీ అప్‌డేట్‌తో 'బరి' సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. వాలీబాల్ క్రీడ నేపథ్యంలో సాగే ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాలో వరుణ్ తేజ్ సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. బాబాయ్ ఆశీస్సులతో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్‌ను త్వరలోనే ప్రారంభించి, వీలైనంత వేగంగా పూర్తి చేయాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఇక నిహారిక మొదటిసారి తన అన్నయ్య సినిమాను నిర్మిస్తుండటంతో ప్రతి విషయంలోనూ చాలా కేర్ తీసుకుంటోంది. 2027 సంక్రాంతి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ పక్కా ప్లానింగ్‌తో ఉన్నారు.


# ముత్యాల మధ్య మంచి ముత్యం కియరా






స్టైల్ ఐకాన్ కియారా అద్వానీ తాజాగా గ్రాజియా మ్యాగజైన్ కవర్ పేజీ కోసం ప్రత్యేకమైన డిజైనర్ లుక్‌లో మెరిపిసోయింది. శరీరమంతా ముత్యాల అల్లికతో తీర్చిదిద్దిన తెలుపు రంగు డిజైనర్ దుస్తుల్లో మెరిసిపోతోంది. నిన్న జరిగిన అవార్డుల వేడుకలో తన ఫ్యాషన్ సెన్స్‌తో అందరినీ ఆశ్చర్యపరిచిన కియారా.. ఇప్పుడు ఈ సరికొత్త లుక్‌తో మరోసారి నెట్టింట సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రముఖ డిజైనర్ క్రేషా బజాజ్ రూపొందించిన ఈ ప్రత్యేకమైన వైట్ అండ్ వైట్ డ్రెస్సులో కియారా ఒక అందమైన శ్వేత వర్ణపు అప్సరసలా కనిపిస్తోంది. ఈ డిజైనర్ వేర్‌లో కియారా ధరించిన బ్రాలెట్.. రఫుల్డ్ ట్యూనిక్ బ్లౌజ్ .. పూసల అల్లికతో కూడిన ట్రౌజర్స్ తనకు ఒక రాయల్ లుక్‌ను ఇచ్చాయి. ముఖ్యంగా డ్రెస్ మొత్తం ముత్యాల వంటి పూసల అల్లికతో ఎంతో ముగ్ధమనోహరంగా ఉంది. టాప్ టు బాటమ్ వైట్ అండ్ వైట్ థీమ్‌లో కియారా తన అందంతో అభిమానుల మనసు దోచుకుంటోంది. ఈ ఫోటోషూట్‌లో కియరా మేకప్, హెయిర్ స్టైల్ కూడా ఈ డ్రెస్సుకి తగ్గట్టుగా ఎంతో పర్‌ఫెక్ట్‌గా సెట్ అయ్యాయి. కేవలం దుస్తులే కాకుండా ఆభరణాలు కూడా ఈ లుక్‌కి మరింత గ్లామర్‌ను అద్దాయి. మీరారీ జువెల్స్ నుండి ఇన్సిగ్నియా ఇయర్ రింగ్స్‌తో పాటు జాంబియన్ ఎమరాల్డ్, బ్రెజిలియన్ సిట్రిన్ కలిసిన 18 క్యారెట్ల బంగారు దుద్దులను కియారా ధరించింది. అలాగే అజ్గా బ్రాండ్‌కు చెందిన గోల్డ్ ప్లేటెడ్ రింగ్ తన వేలికి మరింత అందాన్ని తెచ్చింది. ప్రతి చిన్న విషయంలోనూ జాగ్రత్త వహించి ఈ కవర్ పేజీ షూట్‌ను ఎంతో గ్రాండ్‌గా ప్లాన్ చేయడం ఆసక్తిని కలిగించింది. ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న కియారా.. ఈ ముత్యాల అల్లిక డ్రెస్సులో మంచి ముత్యంలా మెరిసిపోతూ కుర్రకారు గుండెల్లో సెగలు పుట్టిస్తోంది. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు కియారా స్టైల్‌కు ఫిదా అవుతున్నారు. ఒకవైపు తన నటనతో.. మరోవైపు తన అదిరిపోయే ఫ్యాషన్ ఛాయిస్‌లతో కియారా 2026లో తన జోరును కొనసాగిస్తోంది. గీతూ మోహన్ దాస్ టాక్సిక్‌లో కియారా పాత్ర: దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న టాక్సిక్ సినిమాలో కియారా అద్వానీ నాడియా అనే పాత్రను పోషిస్తోంది. ఈ పాత్ర గురించి గీతూ మాట్లాడుతూ.. నాడియా పాత్రలో ఒకవైపు సున్నితత్వం .. మరోవైపు తీవ్రత రెండూ సమానంగా ఉంటాయని..అందుకే ఈ పాత్రకు కియారా తప్ప మరెవరూ సెట్ అవ్వరని తాను ముందే నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కియారా స్క్రీన్ ప్రెజెన్స్‌లో ఒక గాఢమైన మానవీయ కోణం కనిపిస్తుందని.. ఆమెను ఈ పాత్ర కోసం ఎంచుకోవడం కేవలం లాజిక్ కాదని.. అది ఒక బలమైన భావోద్వేగమని గీతూ వెల్లడించారు. సినిమా విషయంలో కియరా క్రమశిక్షణ, నిబద్ధతపైనా ప్రశంసలు కురిపించారు గీతూ.. టాక్సిక్‌తో పాన్ ఇండియన్ స్టార్‌గా కియరా మరో స్థాయిని అందుకుంటుందని అభిమానులు అంచనా వేస్తున్నారు.

# పట్టు పరికిణిలో ఆకట్టుకుంటున్న వైష్ణవి చైతన్య!



'బేబీ' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌డమ్ తెచ్చుకున్న తెలుగు అమ్మాయి వైష్ణవి చైతన్య, ఇప్పుడు తన లేటెస్ట్ ఫోటోషూట్‌లతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ముఖ్యంగా పట్టు పరికిణి, లంగా ఓణి వంటి ట్రెడిషనల్ లుక్స్‌లో అచ్చమైన తెలుగు ఇంటి ఆడపిల్లలా కనిపిస్తూ అభిమానుల మనసు గెలుచుకుంటోంది. అటు మోడ్రన్ డ్రెస్సుల్లో మెరుస్తూనే, ఇటు సంప్రదాయ కట్టుబొట్టుతో తనదైన శైలిలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది ఈ బ్యూటీ. ఆమె అందం, అభినయం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఆ విశేషాలు చూద్దాం.. వైష్ణవి చైతన్య ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసే ఫోటోలకు విపరీతమైన క్రేజ్ ఉంది. తాజాగా ఆమె పట్టు పరికిణి ధరించి దిగిన ఫోటోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. వెండితెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా, ఇలాంటి సంప్రదాయ దుస్తుల్లో ఆమెను చూడటం తమకు ఎంతో ఇష్టమని ఫాలోయర్స్ కామెంట్స్ చేస్తున్నారు. కేవలం ఫోటోలతోనే కాకుండా, తన కళ్ళతోనే హావభావాలను పలికిస్తూ కుర్రకారు గుండెల్లో గంటలు కొట్టిస్తోంది. ఈ ఫోటోలు చూస్తుంటే వైష్ణవి తన తదుపరి సినిమాల కోసం ఎంతగా సిద్ధమవుతుందో అర్థమవుతోంది. కెరీర్ విషయానికి వస్తే, వైష్ణవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. 'బేబీ' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత మళ్ళీ ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఏ పిక్' అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. గత ఏడాది సిద్ధూ జొన్నలగడ్డ సరసన 'జాక్' మూవీలో నటించి మెప్పించిన ఈ భామ, ఇప్పుడు ఈ కొత్త సినిమాతో తన సక్సెస్ గ్రాఫ్‌ను మరింత పెంచుకోవాలని చూస్తోంది. వైష్ణవి క్రేజ్ కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాలేదు. ఇప్పుడు పక్కనే ఉన్న కోలీవుడ్‌లోనూ ఈమె పేరు మారుమోగుతోంది. తమిళ స్టార్ హీరో ఆర్య సరసన ఒక క్రేజీ ప్రాజెక్టులో నటిస్తున్నట్లు సమాచారం. అలాగే హీరో విష్ణు విశాల్ సరసన మరో తమిళ చిత్రంలో నటించే అవకాశం వచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే చర్చలు కూడా మొదలయ్యాయని తెలుస్తోంది. ఇవే కాకుండా ఒక సస్పెన్స్ థ్రిల్లర్ మూవీలో కూడా ఆమె కీలక పాత్ర పోషిస్తోంది. ఇలా రెండు తెలుగు, రెండు తమిళ చిత్రాలతో వైష్ణవి జెట్ స్పీడ్‌లో దూసుకుపోతోంది.

# శ్రీ క్షేత్రంలో సీతారాములకు పంచామృతాభిషేకాలు



**విజయనగరం, (రాజధాని వార్తలు):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సీతారాములకు విశేష పంచామృత అభిషేకాలు గావించారు. సాధకులు అంతర్ముఖులై, ఏ ఆనందం కోసం అన్వేషిస్తున్నారో, తమ మనోమందిరాల్లో ఏ ఆకృతిని ప్రతిష్ఠితం చేసుకుని ఆరాధిస్తున్నారో ఆ దివ్యపథానికి సాకారం– శ్రీరాముడు. మనుషుల్లోని రా అంటే 'రాక్షస గుణాలను మ అంటే 'మ'ర్దించే పరమ దైవం– రాముడు. శివకేశవ చైతన్యాన్ని తనలో సమ్మిళితం చేసుకున్న బీజాక్షర సంపుటి శ్రీ రామ నామం. ర, అ, మ అనే మంత్రాక్షరాల మేలు కలయిక అయిన రామ శబ్దాన్ని సృష్టి, స్థితి, లయ కార్యకారణత్వాలకు ప్రతిఫలంగా భావిస్తారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సీతారాములకు విశేష పంచామృత అభిషేకాలు గావించారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు, రమణమూర్తి, శ్రీదేవి దంపతులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా సీతారాముల కల్యాణోత్సవం

**- వసంత నవరాత్రి మహోత్సవాలలో అనుదినం సతీసమేతంగా పాల్గొన్న ప్రముఖ న్యాయవాది ఉప్పలపాటి రమేష్ రాజు - సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వీనుల విందుగా వీక్షించిన వందలాది మంది భక్తజనులు - కల్యాణోత్సవానికి పరవశించిన ప్రకృతి, ఉరుములతో - మంగళ వాయిద్యాలను, చిటపట చినుకులతో - అక్షతలను స్వామివారి కల్యాణోత్సవానికి తన వంతుగా సమర్పించుకుంది**









**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం దిగువ వీధిలో ఉన్న దేవాలయాల సముదాయంలో గల శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం వెంకట రాఘవాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వసంత నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం నాడు సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. అభిజిత్ లగ్నంలో జరిగిన సీతారాముల కళ్యాణంలో ఉప్పలపాటి రమేష్ రాజు – రమాదేవి దంపతులు, వడలి నాగ వెంకట మహాదేవ శ్రీనివాస్ – బాలా త్రిపురసుందరి దంపతులు పాల్గొన్నారు. వసంత నవరాత్రి మహోత్సవాలలో అనుదినం ఉప్పలపాటి రమేష్ రాజు సతీసమేతంగా భక్తిశ్రద్ధలతో పాల్గొనడం విశిష్టతను సంతరించుకుంది. తెలుగు సంవత్సరాది ఉగాది రోజున వసంత నవరాత్రి మహోత్సవాలకు అగ్ని ప్రతిష్టతో అంకురార్పణ జరిగింది. శుక్రవారం ఉదయం లక్ష్మీ అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, సాయంత్రం విష్ణు సహస్ర నామ పారాయణం లక్ష్మీ హవనం జరిగాయి. శనివారం నాడు సీతారామ స్వామి సహస్ర నామ అర్చన, విష్ణు సహస్రనామ పారాయణం, రామ గాయత్రీ హోమం, ఆదివారం నాడు సూర్య నమస్కారములు, విష్ణు సహస్రనామ పారాయణం నిత్య హోమాలు, సోమవారం నాడు సుదర్శన హోమం విష్ణు సహస్రనామ పారాయణం, మంగళవారం నాడు దాశ ఆంజనేయ స్వామి వారి సహస్ర సింధూర అర్చన, నాగవల్లీ దళార్చన, నిత్య హోమాలు జరిగాయి. బుధవారం నాడు అష్టోత్తర శత కలశాభిషేకం, రామ గాయత్రీ హోమం, లక్ష్మివారం నాడు నిత్య అర్చన, సరస్వతీ దేవత హోమం, శ్రీరామనవమి నాడు ఉదయం 8 గంటలకు మహా పూర్ణాహుతి, 9 గంటలకు సీతారామస్వామి సారి సమర్పణ, 10 గంటలకు సీతారామస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభించబడ్డాయి. శ్రీనివాస ఆచార్యులు కల్యాణ విశిష్టతను వివరిస్తూ సీతారాముల కళ్యాణ కార్యక్రమం జరిపించారు. సీతారాముల కళ్యాణ ఉత్సవంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు పాల్గొని కన్నుల పండుగగా కళ్యాణాన్ని తిలకించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం వేద పండితులు కల్యాణాక్షతలతో భక్తులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ నిర్వాహకులు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలో గల అన్ని గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేద పండితులు ముద్దు శర్మ, మురళీ ప్రసాద శర్మ, కందాల కృష్ణ మురారి, కందాల రమా విహారి, ఆలయ కార్య నిర్వహణ అధికారి కరి శ్రీరామ్ హోమాలు, రామాయణ పారాయణం భక్తిశ్రద్ధలతో జరిపించారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, భక్తజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు.. అన్నదానానికి ఆర్థిక సాయం



**విజయనగరం, హుకుంపేట, (రాజధాని వార్తలు):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక హుకుంపేటలోని శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'చిన్న శ్రీను సోల్జర్స్' ఉపాధ్యక్షుడు తోట వాసు ఆలయ కమిటీకి అన్నదాన కార్యక్రమం నిమిత్తం 5 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు.

**కుటుంబ సభ్యుల పేరున పూజలు:**

తోట వాసు తన అన్నయ్య, ప్రముఖ నాయకులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), వదిన మజ్జి పుష్పాంజలి, వారి కుమార్తె (చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు) సిరమ్మ, మరియు అల్లుడు (నెల్లిమర్ల నియోజకవర్గ వైఎస్ఆర్సిపి యువజన విభాగం అధ్యక్షులు) ప్రదీప్ నాయుడు పేరు మీద స్వామివారికి ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. వారి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, లోకకళ్యాణం జరగాలని కోరుతూ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భద్రాదిలో కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణం

**- రాములోరికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి దంపతులు**







**భద్రాచలం, (రాజధాని వార్తలు):** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో సీతారాముల కళ్యాణం మహోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. శ్రీరామ మహాపట్టాభిషేకం కోసం భద్రాది ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు మిథిలా స్టేడియంలో శిల్ప కళాశోభిత కళ్యాణ వేదికపై సీతారాముల పరిణయ వేదికను, తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా భద్రాదికి చేరుకుంటున్నారు. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానంలో కల్యాణ బ్రహ్మోత్సవాలు అట్ట హాసంగా సాగుతున్నాయి. సీతారాముల కల్యాణానికి ఆధ్యాత్మికత ఉట్టి పడేలా..భక్తకోటి మురిసేలా ఘనంగా ఏర్పాట్లు చేశారు. రాములోరి కల్యాణ ఘట్టాన్ని ప్రత్యక్షంగా కన్నులారా వీక్షించి తరించేందుకు భక్తకోటి పెద్దఎత్తున తరలి వస్తున్నారు.సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ వేడుకకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. నవమి ఉత్సవాల్లో భాగంగా ఆలయ పండితులు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో ఎదుర్కోలు అత్యంత కీలకమైన ఘట్టం. పెళ్లికి ముందు సీతారాములను ఎదురెదురుగా ఉంచి, ఇరు పక్షాల వారు పసుపు, కుంకుమలు, తాంబూ లాలు మార్చుకుంటూ, భక్తిశ్రద్ధలతో భజనలు చేశారు. కల్యాణ వేదికైన మిథిలా ప్రాంగణాన్ని సీతమ్మ పుట్టినిల్లయిన మిథిలా నగరంగా.. పక్కనున్న వైకుంఠ క్షేత్రం రామయ్య వెలసిన ప్రాంతంగా భావిస్తారు. అలాగే.. అర్చకులు భగవంతుని వంశ క్రమాన్ని, గోత్ర నామాలను చదువుతూ పెళ్లికి ముందు వధూవరుల పక్షాన వాదోపవాదాలు చేసుకునే ఈ ఎదుర్కోలు ఘట్టం అత్యంత ఆసక్తికరంగా సాగింది. ఇదిలా వుంటే, శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 11 గంటలకు రామాలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రూ.351 కోట్లతో మొదటి విడత పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే రామాలయ అభివృద్ధికి రూ.586 కోట్లతో బృహత్తర ప్రణాళిక రూపొందించింది రాష్ట్ర ప్రభుత్వం. మొదటి దశ పనులను రూ.351 కోట్లతో చేపట్టేందుకు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. సీతారాముల కళ్యాణ మహోత్సవంలో మంత్రులు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు అనేకమంది హాజరయ్యారు.

# రామతీర్థంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

**- కనుల పండువగా సీతారాముల కళ్యాణం**

**- పట్టువస్త్రాలను సమర్పించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**








**రామతీర్థం, (విజయనగరం), (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లాలోని చారిత్రాత్మక పుణ్యక్షేత్రం రామతీర్థం నీలాచల కొండవద్ద వెలసిన సీతారామచంద్ర స్వామివారి సన్నిధిలో శ్రీరామనవమి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. 'ఉత్తర అయోధ్య'గా పేరుగాంచిన ఈ క్షేత్రంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరై, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే వేలాదిగా తరలి వచ్చిన భక్తుల మధ్య, వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవం భక్తులకు కనులపండువగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రీరామనవమి పర్వదినం సమాజానికి ధర్మం, న్యాయం, సత్యం వంటి విలువలను గుర్తు చేస్తుందని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం మరియు కల్యాణ వీక్షణ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో శాసన మండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా శ్రీరాముని కళ్యాణానికి విచ్చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం నాగమాధవి దంపతులు, ఎమ్మెల్సీలు గాదే శ్రీనివాసులు నాయుడు, పెనుమత్స సూర్యనారాయణ రాజు, సింహాచలం దేవస్థానం ఈవో జల్లేపల్లి వెంకటరావు, ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ దంపతులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం, పోలీస్ యంత్రాంగం తాగునీరు, ప్రసాదం, వైద్య సదుపాయాలు మరియు భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించడంతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# రామ నారాయణంలో సీతారాములకు పంచామృతాభిషేకాలు



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణ శ్రీమద్రామాయణ ప్రాంగణంలో శ్రీరామనవమి పర్వతనాన్ని పురస్కరించుకుని సీతారాములకు పంచామృత అభిషేకాలు గావించారు. శ్రీరామ నామం రక్షణ కవచం శ్రీరామ మంత్రం అభయ హస్తం శ్రీరామచంద్రుడి సద్గుణాలు సదా ఆచరణీయం శ్రీరాముడి వ్యక్తిత్వం ప్రతీ వ్యక్తికి ఆదర్శనీయం రామాయణం భారతీయ సంస్కృతీ, సనాతన ధర్మ ప్రతిరూపం, దీని మౌలిక తత్వాలు, ధర్మ, జ్ఞానాలను శ్రీ మద్రామాయణం ఆవిష్కరిస్తోంది. నేడు ఆ జగదభిరాముడు ఇలపై పుట్టిన రోజు..ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణం శ్రీమద్రామాయణ ప్రాంగణంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతారాములకు వేదమంత్రాల నడుమ దేవాలయం అర్చకులు పంచామృత అభిషేకాలు గావించారు.

# శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలలో పాల్గొన్న మాజీ ఎంపీ అనురాధ




**అమలాపురం, (రాజధాని వార్తలు):** శ్రీరామనవమి వేడుకలలో భాగంగా అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ పలు ఆలయాలలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలలో పాల్గొని పూజలు నిర్వహించారు. అల్లవరం మండలం రెబ్బన పల్లిలోని రామాలయంలో శ్రీ సీతారాముల వారిని దర్శించుకున్నారు.

అమలాపురం పట్టణ పరిధిలోని గోవ్వాలా వారి వీధిలోని రామాలయంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్స వంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉప్పలగుప్తం పంచాయతీ పరిధిలోని ఏటి మెరక, పేరాయి చెరువు రామాలయాలలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బర్రె సీతా రత్నం, కొల్లు సుబ్బారాయుడు, కొల్లు వెంకటేశ్వరరావు, గువ్వాల రాజేష్, దొమ్మిటి రాము, సత్యం కాపు, అంబికా శ్రీను, పందు చిరంజీవి, పేయ్యల రమణ, పందు అంబేద్కర్ ధోనిపాటి వేణు, పందు సత్యనారాయణ, దుర్గాప్రసాద్, అయితాబతులు సత్యనారాయణ, కృష్ణమూర్తి, నాగబాబు, పందు పల్లంరాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి ప్రసన్నకు శుభాకాంక్షలు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రేబాల గ్రామా కమిటీ అధ్యక్షులు పోశంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మరియు కమిటీ సభ్యులు శుక్రవారం మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పిఏసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నెల్లూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రసన్న కుమార్ రెడ్డి నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేకానికి కృషి చేయాలని కమిటీ సభ్యులను సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ గ్రామ నాయకులు చెర్లో సతీష్ రెడ్డి, పోశంరెడ్డి దయాకర్ రెడ్డి వల్లూరు అశోక్ రెడ్డి కోడూరు నిరంజన్ రెడ్డి పోతిరెడ్డి నాగ సుబ్బారెడ్డి ముమ్మిడి కృష్ణారెడ్డి కడవ రవికుమార్ అయ్యం సుబ్బారెడ్డి గుడి అశోక్ పిల్లమెట్ల శ్రీహరి, గంపల అంకయ్య కార్తీక మరియువైసీపీ నాయకులు గొల్లపల్లి విజయకుమార్ కలువ బాల శంకర్ రెడ్డి కాటంరెడ్డి నవీన్ రెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణ రెడ్డ కవనగిరి శ్రీలత, దేవిరెడ్డి సాయిరెడ్డి, కమరగిరి ప్రసాద్, శ్రీమతి వడ్డే సంపూర్ణమ్మ పలువురు ఉన్నారు.

# అరకు ఎంపి తనూజ రాణికి మాజీ మంత్రి ప్రసన్న ధన్యవాదాలు




**కోవూరు/ నెల్లూరు, (రాజధాని వార్తలు):** వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజా రాణి అడిగిన వెంటనే స్పందించి ఆమె ఎంపి నిధుల నుండి రూ. 10 లక్షల రూపాయలతో కోవూరు నియోజకవర్గంలోని ఈ దిగువ పనులను మంజూరు చేసినందుకు కోవూరు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలను మాజీ మంత్రి ప్రసన్న తెలిపారు. కొడవలూరు మండలం నార్తురాజుపాలెం గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు విడవలూరు మండలం చౌకచర్ల గ్రామ ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ. 3 లక్షలు విడవలూరులోని దంపూరు గ్రామ ఎస్సీ కాలనీలో సైడ్ డ్రైన్ నిర్మాణానికి రూ.2 లక్షలను మంజూరు చెయ్యడం వలన ఈ ప్రాంత వైసీపీ నేతలు కూడా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

# వానర రూపంలో సాక్షాత్తు ఆంజనేయస్వామి

## - ఆంజనేయ గుడిలో పెట్టిన ప్రసాదాన్ని తిని పూజ చేస్తున్న వానరుడు





**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు మండలంలోని పడుగుపాడు పంచాయతీలో గల శ్రీనివాసపురంకు చెందిన మిఠాయి బాబు దంపతులు స్థాపించిన అభయఆంజనేయ గుడి వద్ద శుక్రవారం శ్రీరామ నవమి రోజు ఇలాటి అద్భుతం జరగడం పట్ల స్థానికులు గుర్తించారు.

ప్రతిరోజు ఈ ఆలయ అధినేతలు పూజలు చేసి భక్తులకు ప్రసాదములను అందిస్తుంటారు. శ్రీరామ నవమికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు నైవేద్యంలను పంపిణీ చేసారు.

# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

## - వాడవాడలా మిన్నంటిన సీతారాములోరి కళ్యాణ మహోత్సవం - ఉదయం నుండి ఆలయాలలో భక్తుల పూజలు


**అమలాపురం, (రాజధాని వార్తలు):** శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ఒకరోజు ముందుగానే స్వామి వారి ఆలయాలను పూ మాలలు, విద్యుత్ కాంతులతో ముస్తాబు చేసి దేదీప్యమానంగా అలంకరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో స్వామివారి ఆలయాలకు చేరుకుని భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని రామాలయాల్లో వేద మంత్రోచ్ఛరణల మధ్య కన్నుల పండువగా రాముల వారి కల్యాణం నిర్వహించారు. భాజాభజంత్రీలు, వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కళ్యాణం కమనీయంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు రామాలయాల వద్దకు చేరుకుని స్వామివారి కళ్యాణ మహోత్సవాలను తిలకించారు. గ్రామ గ్రామాన వెలసిన సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్న సమేత శ్రీరామచం ద్రమూర్తి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు సీతారాముల కల్యాణాన్ని, శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకించి పునీతులయ్యారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఆల యాలను రంగురంగుల పూల మండపాలతో, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని భజన బృందాల కీర్తనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రీరామనవమి వేడుకలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బెండమూర్లంక సెంటర్ నుండి పేరూరు వై జంక్షన్ వరకు బజరంగ్‌దళ్ కార్యకర్తలు భారీ ఊరేగింపు నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగింది. కొమరగిరిపట్నం గుర్రం వారి వీధిలో జరిగిన శ్రీరామ నవమి వేడుకలలో రాష్ట్ర బీజేపీ నాయకులు దొరబాబు, మాజీ సొసైటీ చైర్మన్ గునిశెట్టి రోహిణి కుమార్ పలువురు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# చట్ట సభల్లో బీసీలకు తగిన రిజర్వేషన్ అమలు చేయాలి

## - ఏప్రిల్ 11న జరుగు ఆమరణ దీక్షను జయప్రదం చేయండి

## - భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర ఈసీ సభ్యులు సోమా గోపాల్




**కోవూరు, (రాజధాని వార్తలు):** బీసీ వై పార్టీ అధినేత వ్యవస్థపకులు బి. రామచంద్ర యాదవ్ ఇచ్చిన పిలుపు మేరకు మార్చి 31లోపు బీసీలకు న్యాయం జరిగే చట్టాలను అమలు చెయ్యాలని కోరుతూ అలా చెయ్యకపోతే ఏప్రియల్ 11న ఆమరణ నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు అధినేత రామచంద్ర యాదవ్ సూచించరని బీసీ వై రాష్ట్ర ఈసీ సభ్యులు సోమా గోపాల్ అన్నారు. పైకార్యక్రమంలను విజయవంతం చెయ్యడములో బీసీలంతా ఏకం కావాలని కోరారు. బీసీ రక్షణ చట్టం అమలు, చట్టసభల్లో 44 రిజర్వేషన్, రాజధాని ప్రాంతాల్లో బీసీలకు 1000 ఎకరాలు భూమి కేటాయింపు, బీసీ కార్పొరేషన్‌లకు తగిన నిధులు ఏర్పాటు, సమగ్ర కులగణన, రిజర్వేషన్ ప్రకారం విద్య ఉద్యోగములు, అమలు తదితర అంశాలపై ప్రభుత్వాలు చొరవ తీసుకొని బీసీ సామాజిక వర్గాలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. బీసీల కొరకు చేస్తున్న పోరాటాలు తమ అధినేత బోడె రామచంద్ర యాదవ్‌కు మద్దతుగా బీసీలంతా ముందుకు రావాలని సోమా అన్నారు.

# ఏ పి ఈ ఎమ్ సి ఎల్‌కు మంచి రోజులు : చైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి





**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఏ పి ఈ ఎమ్ సి ఎల్ కార్యాలయంలో నిర్వహించిన బోర్డు సమావేశంలో సంస్థకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నామని చైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. 2024-25 ఆర్ధిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ రిపోర్ట్‌ను సమగ్రంగా పరిశీలించామని అన్నారు. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను బోర్డు ముందు ప్రవేశపెట్టి ఆమోదించామన్నారు. సంస్థలో పర్మినెంట్ ఉద్యోగాల నియామకానికి సంబంధించి ప్రణాళికను సిద్ధం చేసి, తదుపరి ఆమోదం కోసం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు పంపించాము. ఏ పి ఈ ఎమ్ సి ఎల్ అధికారిక లోగోను బోర్డు ఆమోదించింది. త్వరలోనే లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాము. రాష్ట్రంలోని ప్రతి ఇండస్ట్రీ ఏ పి ఈ ఎమ్ సి ఎల్ పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు చేపడుతున్నాము. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వాహనాల రిజిస్ట్రేషన్ కూడా తప్పనిసరి చేయాలని నిర్ణయించాము. ఇండస్ట్రీల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సమర్థవంతంగా రీసైక్లింగ్ చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాము.

భవిష్యత్ కార్యాచరణపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ పి ఈ ఎమ్ సి ఎల్ ఎమ్ ఆర్‌పి ఖజురియా ఇఫ్ఎస్ & టి డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ & ప్రభుత్వ ముఖ్య ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఐఏఎస్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ శర్వానంద్ ఐఎఫ్, జిఎం విజయ కుమారి మరియు బోర్డ్ డైరెక్టర్స్ సమావేశమయ్యారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్స్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్కు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# గంట్ల శ్రీను బాబుని ఘనంగా సన్మానించిన తోటి పాత్రికేయ మిత్రులు

**- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా వరుసగా మూడువ ఉగాది పురస్కారం అందుకున్న గంట్ల - దేశానికి సైనికుడు.. సమాజానికి ...ట్ట**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కష్టాల్లో ఉన్న జర్నలిస్టుల్ని గుర్తించి వారికి తగిన సహాయం అందేలా చేసి, వారిలో మనోధైర్యం నింపడం ఒక గొప్ప అనుభూతినిస్తుందని గంట్ల శ్రీనుబాబు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గొంతుకగా మారి, వ్యవస్థలను ప్రశ్నించే ధైర్యమే జర్నలిజం. ఒక సామాన్య వ్యక్తిగా కెరీర్ను ప్రారంభించి, అసాధారణమైన సామాజిక శక్తిగా ఎదిగే అద్భుత అవకాశం ఈ రంగం సొంతమని శ్రీనుబాబు పేర్కొన్నారు. తన సొంత నిధుల నుండి లక్షల రూపాయలు ఖర్చు చేసి అవసరమైన వారికి సహాయం అందించడం ద్వారా ఆయన సహృదయతను చాటుకున్నారు. అకాల మరణం చెందిన జర్నలిస్టుల కుటుం బాలకు భరోసాగా నిలవడం, వారి పిల్లల విద్య కోసం సహాయం చేయడం ఆయనకు నిత్యకృత్యంగా మారింది. సేవే లక్ష్యంగా, సహచరుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న గంట్ల శ్రీనుబాబు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని, ఇంకా మరెందరో జర్నలిస్టులకు అండగా నిలవాలని జర్నలిస్ట వర్గాలు ఆకాంక్షిస్తున్నాయి. ఇటీవలే నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వరుసగా మూడువ ఉగాది పురస్కారం అందుకున్న గంట్ల శ్రీను బాబుకి శుభాకాంక్షలు తెలియజేస్తూ. గంట్ల శ్రీను బాబుకి ఘనంగా సన్మానం చేసిన తోటి జర్నలిస్టులు. ఈ కార్యక్రమంలో ఫైవ్ మ్యాన్ కమిటీ పక్కి రమేష్,సింహాద్రి,కాళ్ళ వినయ్, గౌతమ్, ఇచ్చాపురం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురం సిఐగా వైఆర్కె బాధ్యతలు స్వీకరణ

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్గా వై ఆర్ కె శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సిఐగా పనిచేసిన విజయ్ కుమార్ బదిలీ కాగా ఆయన స్థానంలో వై ఆర్ కే శ్రీనివాస్ విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించేందుకు విచ్చేసిన సిఐ వైఆర్ కే శ్రీనివాస్కు స్థానిక ఎస్సై వి మౌనిక, స్టేషన్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పండితుల ప్రత్యేక ఆశీర్వచనం పొంది విధుల్లో చేరారు. వై ఆర్ కే శ్రీనివాస్ గతంలో ఇదే పోలీస్ స్టేషన్లో 2009 - 2010 సంవత్సరంలో ఎస్సై గాను, 2018 ఏప్రిల్ నుంచి 2018 సెప్టెంబర్ వరకు సీఐగా బాధ్యతలు నిర్వర్తించారు. దానికి ముందు ఆయన ఎస్ఐగా సామర్లకోట పోలీస్ స్టేషన్లోనూ పని చేసిన అనుభవం ఉంది. ఎలా ఉండగా ఇప్పటివరకు జగ్గంపేట బాధ్యతలు చేపట్టిన వై ఆర్ కె "వేకెన్సీ రిజర్వ్"(వి ఆర్)కు వెళ్లి అక్కడ నుండి తిరిగి పెద్దాపురం సిఐగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టి సిబ్బందిని



పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో పెద్దాపురం సర్కిల్ పరిధిలో సైబర్ నేరాలతో పాటు అన్ని రకాల నేరాల అదుపునకు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు ఆయన చెప్పారు. కాగా ఈ సందర్భంగా విధుల్లో చేరిన వైఆర్కేకు సామర్లకోట, పెద్దాపురం పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# కార్మికుల పెండింగ్ క్లయిమ్‌లు విడుదల చేయాలి

**- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజకుమార్**



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లయిమ్‌లు విడుదల చేస్తూ జీవో ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ డిమాండ్ చేసారు. పెద్దాపురం భవన నిర్మాణ కార్మికుల (సీఐటీయూ) సమావేశం యాసలపు సూర్యారావు భవనంలో గడిగట్ల సత్తిబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సంక్షేమ బోర్డు పథకాలు విడుదల చేసిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సంక్షేమ పథకాలతో కూడిన వివరాలు, రావాల్సిన పెండింగ్ వివరాలతో కూడిన గోడ పత్రికను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారని, కానీ మొత్తం పథకాలు కాకుండా కేవలం 4 పథకాలు అమలు అవుతాయని చెప్పడం దారుణమన్నారు. అమలు కూడా 2026 మార్చి 1 నుండి అని ప్రకటించడం, ముందు పథకాలు పనిచేయవని చెప్పడం దారుణమన్నారు. కార్మిక శాఖ మంత్రి అసెంబ్లీలో సంక్షేమ బోర్డు నిధులు 3 వేలు కోట్లు ఉన్నాయని ప్రకటించారని, కానీ వాటిని విడుదల చేయడం లేదన్నారు. ఏప్రిల్, మే నెలలో జరిగే పోరాట కార్యక్రమాలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రైవేట్ ఎలిక్ట్రీకల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ, అధ్యక్షులు తాడిశెట్టి గంగ, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వడ్డి సత్యనారాయణ, గునూరు రమణ, అనూరు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ధర్మరాజు, సీఐటీయూ నాయకులు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రీ మరిడమ్మ అమ్మవారికి బంగారు, వెండి పుష్పలతో పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారిణి, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కే విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయం త్రం వరకు మరిడమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం జరిపి బంగారు, వెండి పుష్పములతో ఆసాదులు ప్రత్యేక పూజ, అర్చన కార్యక్రమములు చేపట్టారు. పూజలో భాగంగా వేద పారాయణ చేపట్టగా భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల పాల్గొన్న భక్తులకు పులిహోర ప్రసాద వితరణ చేపట్టారు. ఈ పూజల్లో ఆలయ సిబ్బంది, అర్చకులు భక్తులకు సేవలు అందించారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan